తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త



## మఠాల అక్రమాలపై చర్యలు

### -రాష్ట్రమంత్రి ఆనం రామనారాయణరెడ్డి

తిరుమల, నవంబర్ 28(ప్రభాతవార్తప్రతినిధి: శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం వచ్చే భక్తులకు గదుల కేటాయింపు, కల్యాణమండపాలు ఇతరత్రా వ్యాపారలావాదేవీలు ఇష్టానుసారం చేస్తున్న మఠాలపై చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్రదేవాదాయశాఖ మంత్రి ఆనంరామనారాయణరెడ్డి తెలిపారు. టిటిడి ధర్మకర్తలమండలి ఆ దిశగా చర్యలకు ఉపక్రమించిందన్నారు. తిరుమలలో సంస్కరణలు అమలుకావడంతో భక్తులకు సంతృప్తికరమైన, మెరుగైన సేవలందుతున్నాయన్నారు. గురువారం ఉదయం రాష్ట్రమంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, వాసంశెట్టి సుభాష్ శ్రీవారిని దర్శించుకున్నారు.



## దర్యాప్తులో కేసులే కీలకం !

### కల్తీనెయ్యి సరఫరాలో పెద్దలపై విచారణ తప్పదా?



తిరుపతి, నవంబర్ 28(ప్రభాతవార్త: తిరుమల లడ్డూప్రసాదాలకు సరఫరా జరిగిన కల్తీనెయ్యి బాగోతంలో దర్యాప్తుచేపట్టిన సిబిఐ సిట్ అధికారులు అక్రమాలు, అవినీతిపై కేసులు నమోదుకు సిద్ధమవుతున్నారు. గత ఐదేళ్ళ వైసిపి ప్రభుత్వంలోని టిటిడి ధర్మకర్తలమండలి పెద్దలు నెయ్యి సరఫరాకు తీసుకున్న నిర్ణయాలు, టెండర్లు, సరఫరాచేసిన కాంట్రాక్టర్లు చివరకు కల్తీనెయ్యి ఉదంతంపై సమగ్ర దర్యాప్తులో భాగంగా సిట్ టిటిడి పెద్దలను విచారణ చేయడానికి ఉపక్రమిస్తోంది. ఇప్పటికే పాత్రధా రులుగా ఉన్న కొందరిని విచారణ చేసిన సిట్ కీలక సమాచారం సేకరిం చారు. నెయ్యి సరఫరాకు టెండర్లు కేటాయించిన విధానం, డైరీల నుండి నెయ్యి సరఫరా చేసిన తీరు దర్యాప్తులో కొన్ని విస్తుబోయే విష యాలు వెలుగుచూశాయి. ఈ వ్యవహారంలో కీలకంగా గత టిటిడి ధర్మకర్తలమండలి మాజీ చైర్మన్లతోబాటు కొందరు మాజీ సభ్యులను, టిటిడిలో బాధ్యతగల అధికారులను, కొనుగోళ్ళ కమిటీలో ఉన్న అధికారులను విచారణకు పిలవనున్నారు. టిటిడి నిబంధనలను ఉల్లంఘించి కల్తీనెయ్యి సరఫరాచేశారని టిటిడి మార్కెటింగ్ విభాగం కొనుగోళ్ళ జిఎం మురళీకృష్ణ ఏఆర్ డైరీపై తిరుపతి ఈస్టు పోలీసులకు ఫిర్యాదుపై సిట్ ఆరా తీస్తోంది. 10లక్షల కిలోల నెయ్యిసరషరాకు ఏఆర్ డైరీకి ఈ ఏడాది మే 15న ఆర్డర్ ఇచ్చామని, జూన్ 12,20, 25తేదీలతోబాటు జులై 6వతేదీ 4ట్యాంకర్ల కల్తీ నెయ్యి సరఫరా చేసింది.ఇందుకు జులై 22,23,27తేదీల్లో ఆ డైరీకి షోకాజ్ నోటీసులు జారీచేశారు. సిట్ బృందం కీలక దర్యాప్తులో ఇప్పుడు ఎక్కడకు దారితీస్తుందో చూడాల్సిందే.

## చిన్నశేష వాహనంపై శ్రీమహాలక్ష్మి

తిరుచానూరు, నవంబర్ 28, ప్రభాతవార్త: చిన్నశేష వాహనంపై మురళీ కృష్ణుని అలంకారంలో పద్మావతి అమ్మవారు భక్తులను కటాక్షించారు. తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల మొదటిరోజైన గురువారం రాత్రి పద్మావతి అమ్మవారు మురళి కృష్ణుడి అలంకారంలో పిల్లనగ్రోవి ధరించి చిన్నశేషవాహనంపై అభయమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని ఆలయ ముఖ మండపం వద్ద స్నపనతిరుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం వాహన మండపం వద్ద అమ్మవారిని సుందరంగా అలంకరించారు. తరువాత చిన్నశేష వాహనంపై మురళీ కృష్ణిని అలంకారంలో పద్మావతి అమ్మవారు భక్తులను అనుగ్రహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారికి కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులతో మొక్కులు చెల్లించుకున్నారు. చిన్నశేష వాహనంపై అమ్మవారు జీవకోటిని ఉద్ధరించే లోకమాతగా దర్శనమిస్తారు. ఆలయ అర్చకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఈవో జె.శ్యామల రావు దంపతులు, జెఈవోలు వీరబ్రహ్మం మరియు గౌతమి, ఆలయ డెప్యూటీ ఈవో గోవింద రాజన్, ఆలయ అర్చకులు బాబుస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ చలపతి, సుభాష్, ఏవీఎస్వో సతీష్ కుమార్, ఇతర అధికారులు, పాల్గొన్నారు.



## శాస్త్రోక్తంగా ధ్వజారోహణం

### ప్రారంభమైన అమ్మవారి బ్రహ్మోత్సవాలు

తిరుచానూరు, నవంబర్ 28, ప్రభాతవార్త: తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలకు గురువారం ఉదయం శాస్త్రోక్తంగా ధ్వజారోహణం నిర్వహించారు. ఉదయం అమ్మవారికి సుప్రభాత సేవ, సహస్ర నామార్చన, నిత్య అర్చన జరిపారు. అనంతరం ఉదయం 6.30 గంటలకు నాలుగుమాడ వీధుల్లో తిరుచ్చి ఉత్సవం జరిపి, ధ్వజ స్థంభ తిరుమంజనం నిర్వహించారు. ఉదయం 9 గంటలకు బ్రహ్మోత్సవాలకు సకల దేవతలను ఆహ్వానిస్తూ గజపటాన్ని ఆరోహణం చేశారు. తితిదే ఈవో జె. శ్యామల రావు దంపతులు, అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మం, సివిఎస్వో శ్రీధర్, డిప్యూటీ ఈవో గోవింద రాజన్, పాంచరాత్ర ఆగమ సలహాదారు మణికంఠ స్వామి, కంకణ భట్టార్ శ్రీనివాసాచార్యులు, అర్చకులు బాబు స్వామి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## దివంగత నారా రామ్మూర్తి నాయుడుకు

## హైందవ సంప్రదాయాలతో 'కర్మక్రియలు'

### నారా రోహిత్, గిరీష్ పిండ ప్రధానం.. నివాళులర్పించిన చంద్రబాబు, లోకేష్

చంద్రగిరి, నవంబర్ 28 ప్రభాతవార్త: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోదరుడు దివంగత మాజీ ఎంఎల్ఏ నారా రామ్మూర్తి నాయుడు కర్మక్రియలు గురువారం నారావారి పల్లిలో హైందవ సంప్రదాయం ప్రకారం నిర్వహించారు. నారావారి వ్యవసాయ క్షేత్రంలో తండ్రి కర్మక్రియలను కుమారులు నారా రోహిత్, నారా గిరీష్ జరిపించారు. తండ్రి ఆత్మశాంతికై సంప్రదాయానుసారం శాస్త్రోక్తంగా పిండ ప్రధానం చేశారు. ఈ సమయంలో చంద్రబాబు, లోకేష్ దగ్గరుండి కార్యక్రమాన్ని తిలకించారు. అనంతరం చంద్రబాబు, లోకేష్, రోహిత్, గిరీష్ కర్పూర హారతులు ఇచ్చి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దాయాదులు, సమీప బంధువులను మాత్రమే ఆహ్వానించి పూర్తి చేశారు. సాయంత్రం శేషాపురంలోని శేషాచల లింగేశ్వర స్వామి వారి ఆలయంలో నారా చంద్రబాబు నాయుడు, నారా భువనేశ్వరి, నారా లోకేష్, నారా రోహిత్, నారా గిరీష్, కుటుంబ సభ్యులతో కలిసి స్వామి వారిని దర్శించుకుని ఆశీస్సులు అందుకున్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను ఎంఎల్ఏ పులివర్తి నాని పర్యవేక్షించారు. ఇక్కడి నుండి కందులవారిపల్లిలోని దివంగత హరిహర చౌదరి, నారా చిన్నబ్బనాయుడు, కనుమూరి తులసమ్మ ఇండ్లకి వెళ్ళి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. రాత్రి ఇంటికి చేరుకుని ఆపై కర్మక్రియలు పూర్తి చేసిన రోజు తలకొరివి పెట్టిన వారు సాయంత్రం సంప్రదాయానుసారం దాయాదుల నివాసాలకు నారా ఇందిరమ్మ, నారా రోహిత్, నారా గిరీష్ (గడపతొక్కి రావడం) వెళ్ళి వచ్చారు.



**నారావారిపల్లి లోనే బస**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, నారా భువనేశ్వరీ, నారా లోకేష్ కుటుంబం రాత్రికి నారావాపిపల్లిలోనే బస చేయనున్నారు. శుక్రవారం తిరుగు ప్రయాణం కానున్నారు.

## ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరు అప్రమత్తం

### - గోడపత్రికలు, బ్యానర్లను విడుదల చేసిన కలెక్టర్




చిత్తూరు, నవంబర్ 28 ప్రభాతవార్త: ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా వుండాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ పిలుపునిచ్చారు. డిసెంబర్ 1న ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం పురస్కరించుకుని కలెక్టర్ సుమిత్‌కుమార్ గురువారం కలెక్టరేట్‌లో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ గోడపోస్టర్లు, బ్యానర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎయిడ్స్ అనేది హ్యూమన్ ఇమ్యూనో డిఫికెన్సీ వైరస్(మానవుని శరీరంలో రోగ నిరోధక శక్తిని క్షిణింపచేయునది) ద్వారా వస్తుందని, ఉపయోగించిన సిరంజీలు మళ్ళీ వాడితే, హెచ్‌ఐడి పాజిటివ్ బ్లడ్ వున్న వారి రక్తంను మరొకరికి ఎక్కిస్తే, పాజిటివ్ వున్న తల్లి నుండి బిడ్డకు సంక్రమిస్తుందన్నారు. ఎయిడ్స్‌కు నివారణ ఒక్కటే మార్గమన్నారు. హెచ్‌ఐవి వ్యాధి గ్రస్తులతో కలిసిన, తిరిగినా, భోజనం చేసిన, కరచలనం చేసినా, వారు ఉపయోగించే పనిముట్లు మనం తాకినా హెచ్‌ఐవి రాదన్నారు. హెచ్‌ఐవి పాజిటివ్ వున్న వ్యక్తులు ఏఆర్‌టి సెంటర్ల ద్వారా ఉచిత మందులతో ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుని జీవితాంతం జీవించవచ్చునన్నారు. 2030 నాటికి హెచ్‌ఐవి లేని సమాజ ఆవిష్కరణ లక్ష్యంగా అందరు కలసికట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రభావతిదేవి, అడిషనల్ డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకటప్రసాద్, జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ హనుమంతరావు, ఆర్‌బిఎస్‌కె కో-ఆర్డినేటర్ డాక్టర్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

### సిఎం ఇలాఖాలో

## 'లక్ష ' సభ్యత్వాలే టార్గెట్

### తెదేపా సభ్యత్వ నమోదులో దూసుకుపోతున్న కుప్పం.. రాష్ట్రంలోనే ద్వితీయ స్థానం !!

కుప్పం, నవంబర్ 28 ప్రభాతవార్త సిఎం చంద్రబాబునాయుడు సొంత నియోజకవర్గం కుప్పం రాష్ట్రంలోనే సభ్యత్వ నమోదులో ద్వితీయ స్థానంలో నిలిచింది. కుప్పం నియోజకవర్గంలో 2, 25,783మంది ఓటర్లు ఉండగా ఇప్పటికే 85329 సభ్యత్వాలను పూర్తి చేశారు. నియోజకవర్గంలోని కుప్పం గ్రామీణ, మున్సిపల్, గుడుపల్లె, శాంతిపురం, రామకుప్పం మండలాల్లో శాసనమండలి విప్, ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఎపిఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నంల మార్గదర్శకాల్లో మండల పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు సభ్యత్వాలను పండగ వాతావరణంలో నిర్వహిస్తున్నారు. ఈ దఫా కుప్పంలో లక్ష సభ్యత్వాలు పూర్తి చేయాలని టార్గెట్‌గా నిర్ణయించుకున్నారు. సభ్యత్వ నమోదులో రాజంపేట నియోజకవర్గం మొదటి స్థానంలో ఉంది. ఇక్కడ 2,41,334మంది ఓటర్లు ఉండగా గురువారం ఉదయం నాటికి 98637సభ్యత్వాలు చేశారు. మూడో స్థానంలో కళ్యాణదుర్గం నియోజకవర్గం ఉంది. ఇక్కడ 2,30694మంది ఓటర్లు ఉండగా 78715 సభ్యత్వాలు చేశారు. పాలకొల్లు నియోజకవర్గంలో 1,95122మంది ఓటర్లు ఉండగా ఇక్కడ 76088 సభ్యత్వాలు చేయగా నాలుగోస్థానంలో ఉంది. ఇక ఆత్మకూరు నియోజకవర్గంలో 2,15401మంది ఓటర్లు ఉండగా 68799 సభ్యత్వాలతో ఐదో స్థానంలో ఉంది. మంత్రి నారా లోకేష్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరి నియోజకవర్గంలో 2,92464మంది ఓటర్లు ఉండగా ఇక్కడ 67969 సభ్యత్వాలతో ఆరోస్థానంలో ఉంది. ఇక ఏడోస్థానంలో కనిగిరి నియోజకవర్గం ఉంది. ఇక్కడ 2,40079 ఓటర్లకు గాను 61814 సభ్యత్వాలు చేశారు. ఎనిమిదో స్థానంలో కోడూరు నియోజకవర్గం ఉంది. ఇక్కడ 2,04465మంది ఓటర్లకు గాను 61814సభ్యత్వాలు చేశారు. వినుగొండ నియోజకవర్గం 2,64691మంది ఓటర్లు ఉండగా 59325 సభ్యత్వాలతో తొమ్మిదో స్థానంలో ఉంది. ఉండి నియోజకవర్గం 52073సభ్యత్వాలతో పదో స్థానంలో ఉంది.

## జ్యోతిరావు పూలేకు కలెక్టర్ ఘన నివాళి



తిరుపతి కార్పొరేషన్, నవంబర్ 28, ప్రభాతవార్త: మహాత్మా జ్యోతిబాపూలే వర్ధంతి సందర్భంగా జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ మహాత్మ జ్యోతిబాపూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించారు. మహాత్మా జ్యోతిబా పూలేకు నివాళులు అర్పించిన వారిలో జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి బాల కొండయ్య, కలెక్టరేట్ అధికారులు, వివిధ శాఖల సిబ్బంది తదితరులు ఉన్నారు.

## సాగు వ్యయం మరింత అధికం

### పెరిగిన ఎరువులు ధరలు అవస్థల్లో అన్నదాతలు

వెంకటగిరిరూరల్, నవంబర్ 28 ప్రభాతవార్త: రబీ సీజన్ కారణంగా జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నది. ఇటీవల కురిసిన వర్షాలు కారణంగా వ్యవసాయ సాగు అనుకూలం కావడంతో జిల్లాలో ఒక్క సారిగా లక్షల ఎకరాలల్లో వరి సాగు జరగడంతో ఎరువుల వినియోగం గణనీయంగా పెరిగింది. ఇదే అదును చూసుకోని ఎరువులు వ్యాపారస్తులు ధరలు తమ ఇష్టనుసారంగా విక్రయిస్తున్నారు. వరి సాగుకు అధికంగా యూరియా వినియోగిస్తారు. ప్రవేట్ డీలర్లు తమ ఇష్టను సారంగా ఎరువులు విక్రయాలు చేస్తున్న సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నరనే విమర్శలు వినిపిస్తున్నాయి. అంతే కాకుండా కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ వారు ఎరువులు ధరలు పెంచడంతో సామాన్య రైతులు వ్యవసాయ సాగు చేసేందుకోసం ఎరువులు కొనుగోలు చేసి పరిస్థితి లేకుండా పోయింది. డిఎపి మిశ్రమ పోటాషియం ఎరువులు పెంపు మరింత ఆర్థిక భారం అన్నదాతలపైన పడునున్నంది. డిఎపి కాంప్లెక్సు 50 కిలోల బస్తా ధర 90 రూపాయల వరకు పెరిగింది. మండల గ్రామీణ ప్రాంతల ల్లోని ఎరువులు డీలర్లు బస్తాకి పది నుంచి ఇరవై రూపాయలకు పైగా అదనంగా పెంచి గ్రామీణ రైతులు నడ్డి విరగకొట్టుతున్నారు. ఇప్పటికైన ప్రభుత్వం, పాలకులు రైతులు శ్రేయస్సు దృష్టిలో ఉంచుకొని రైతులు అన్ని రకాలుగా ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



ఎరువుల గుడైన్‌లల్లో ఉన్న కాంప్లేక్సు ఎరువులు

## మా గ్రామాలకు ఎలా వెళ్ళాలి?

### మరమ్మతులకోసం గేటు మూసేసారు వంతెన కిందేమో నీరు



ఊరందూరు రైల్వే గేట్ మరమ్మతుల దృశ్యం



రైల్వే వంతెన కింద నీళ్ళు నిలచిన దృశ్యం

శ్రీకాళహస్తి, నవంబర్ 28 ప్రభాతవార్త శ్రీకాళహస్తి పట్టణంలోని పానగల్ సమీపంలో శ్రీకాళహస్తి మండలానికి సంబంధించిన గ్రామాలకు వెళ్ళటానికి ఊరందూరు రైల్వేగేటును మరమ్మత్తుల పేరతో మూసివేసారు. డైవర్షన్ రోడ్డులో రైల్వే వంతెన కింద వర్షపు నీరు ప్రవహిస్తుంది. మరి మా గ్రామాలకు ఎటు వెళ్ళాలి? అని పలు గ్రామాలకు సంబంధించిన ప్రజలు వాపోతున్నారు. శ్రీకాళహస్తి పట్టణం నుంచి గ్రామాలకు వెళ్ళు ఊరందూరు దారిలో రైల్వే క్రాసింగ్ గేట్ ఉంది. ఇక్కడ మరమ్మతుల పేరుతో డిసెంబర్ 1 వరకు దారిని మూసివేసి డైవర్షన్ ఇచ్చారు. అయితే ఇక్కడ రైల్వే వంతెన కింద నిండుగా వర్షం నీరుతో నిండింది. అసలే ఇది మలుపు దానికి తగ్గట్లు నీళ్ళు ద్విచక్రవాహాన చోదకులు ఎలా వెళ్ళాలో తెలియక తికమక పడుతున్నారు. రైల్వే గేటు మూసివేయటంతో ఊరందూరు, జింగిలిపాళెం, ముచ్చివోలు, ఫ్యాక్టరీ వాహనాలు మరి పాతిక గ్రామాల ప్రజలు తిప్పలు పడుతున్నారు.

**దారి మళ్ళి వస్తున్న కొన్ని వాహానాలు:**

శ్రీకాళహస్తిలోని ఊరందూరు రైల్వే క్రాసింగ్ గేట్ మూసివేయటంతో వెంకటగిరి, పల్లం, గొల్లపల్లి నుంచి వచ్చే వాహనాలు దారి మళ్ళీ వస్తున్నాయి. వెంకటగిరి వాహనాలు ఏర్పేడు మీదుగా పయనం సాగిస్తున్నాయి. ఊరందూరు మార్గం ఆర్‌అండ్‌బికి సంబంధించినది. రైల్వే అదికారులు గేట్‌మూసి వేస్తున్నట్లు ప్రకటించినపుడు ఆర్‌అండ్‌బిశాఖ ముందు జాగ్రత్తగా ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ ఎందుకో పట్టించుకోలేదు. దాంతో పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. వెంకటగిరి వాహనాలు ఏర్పేడు మీదుగా నడవటం వల్ల సుమారు 30కిలో మీటర్లు అదనపు ప్రయాణం చేయాల్సి వస్తుంది. అధికారుల నిర్లక్ష్యంతో గ్రామీణ ప్రజుల ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఊరందూరు మార్గంలో ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు రద్దీగా ఉండే ప్రాంతాల్లో ముందు జాగ్రత్త ఒరెండు శాఖల మధ్య సమన్వయం లేకపనులు చేపట్టడంతో గ్రామీణ ప్రజలు తిప్పలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు సమన్వయంతో ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని నిర్ణయాలు తీసుకుంటే బాగుంటుంది.

## దాడి చేసిన వ్యక్తి అరెస్టు

చిత్తూరు, నవంబర్ 28 ప్రభాతవార్త:
చిత్తూరు టుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సంతపేట కైలాసపురంకు చెందిన ఎన్.విఙ్ఞేష్‌పై ఈ నెల 25వ తేదీ అదే ప్రాంతానికి చెందిన ఎం.మహేంద్ర దాడి చేశాడు. ఈ మేరకు ఎన్.విఙ్ఞేష్ టుటౌన్ పోలీసులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన ఇన్స్‌పెక్టర్ నెట్టికంతయ్య ఈ కేసులో నిందితుడైన ఎం.మహేంద్రను గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

## ఎస్టీలపై దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేసిన పోలీసులు

పాలసముద్రం, నవంబర్ 28 ప్రభాతవార్త:
మండలంలోని వనదుర్గాపురం పంచాయతీలో ఎస్టీలపై దాడి చేసిన నిందితుడు మన్యం నాగరాజును పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఎస్టీ కాలనీలో నివాసం వుంటున్న వారి కోసం ప్రభుత్వం వేసిన రహదారిపై చెప్పులు వేసుకుని వెళ్ళకూడదంటూ గత కొంతకాలంగా ఓ వ్యక్తి ఎస్టీలను బెదిరించేవాడు. ఈ మేరకు రెండు రోజుల క్రితం ఇద్దరు ఎస్టీలు ఆ రోడ్డుపై చెప్పులు వేసుకుని వెళ్తుండటం చూసిన మన్యం నాగరాజు వారిపై దాడి చేసి చెప్పులు తీసి నడచి వెళ్ళాలని ఆదేశించాడు. ఈ దాడిలో గాయపడిన ఎస్టీలు నేరుగా పోలీసులను ఆశ్రయించకుండా పత్రికల వారిని ఆశ్రయించడంతో ఈ వార్తకు సంబంధించిన కథనాలు పత్రికల్లో ప్రచురితం కావడంతో స్పందించిన కార్వేటినగరం సర్కిల్ ఇన్స్‌పెక్టర్ హనుమంతప్ప గురువారం మన్యం నాగరాజును అరెస్టు చేశారు.

### చెడు వ్యసనాలతో వచ్చే ఆనందం కన్నా...

## విద్యతో వచ్చే గౌరవం, ఆనందం గొప్ప... డిఎస్పీ

పలమనేరు, నవంబర్ 28, ప్రభాతవార్త:



చెడు వ్యసనాలతో వచ్చే ఆనందం కన్నా ఉన్నత స్థాయికి చేరుకుంటే వచ్చే గౌరవం, ఆనందం గొప్పదని పలమనేరు డిఎస్పీ ప్రభాకర్ విద్యార్థులకు సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తాత్కాలిక ఆనందం కోసం అనేక చెడు వ్యసనాలకు అలవాటు పడుతున్నారని అందులో డ్రగ్స్ ఒకటన్నారు. డ్రగ్స్‌లో ఉన్న ఆనందంకన్నా పలురెట్లు ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత స్థాయిలో ఉన్నప్పుడు తల్లిదండ్రులు, స్నేహితులు, బంధువులు, ప్రజలు ఇచ్చే మర్యాదలో ఆనందం ఉంటుందని ప్రతి విద్యార్థులు ఈ విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని సూచించారు. ఇటీవల కాలంలో గంజాయి వంటి మత్తు పదార్థాలకు విద్యార్థులు బానిసలుగా మారుతున్నారని, గంజాయి విక్రయించిన వాటిని వినియోగించిన చట్టపరమైన చర్యలు తప్పవని స్థానికంగా అలాంటి విషయాలను గుర్తిస్తే తక్షణం పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. నానాటికి సైబర్ నేరాలు అధికంగా జరుగుతున్నాయని వాటిపట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గోకులం షెడ్లను అర్హులకు మంజూరు చేయాలి

- ఎంపిటిసి సభ్యుల డిమాండ్

శాంతిపురం, నవంబర్ 28 ప్రభాతవార్త



మండలంలో ప్రభుత్వం మంజూరు చేసిన గోకులం షెడ్లను అధికార పార్టీకి చెందిన వారికే ఇస్తున్నారని ఎంపిటిసిలు తీవ్రస్థాయిలో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఎంపిపి వసుంధర కోదండరెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. మండలాలనికి 125 గోకులం షెడ్లు మంజూరైతే ఒకే పార్టీకి చెందిన వారికే ఇవ్వడం తగదని ఎంపిటిసిలు పేర్కొన్నారు. అర్హులకు రెండో విడతలో మంజూరు చేస్తామని అధికారులు తెలిపారు. గ్రామాల్లో విష జ్వరాలు ప్రబలుతున్నాయని వైద్యాధికారులు గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటుచేయాలని ఎంపిటిసి రవి పేర్కొన్నారు. మొరసనపల్లి పంచాయతీలో బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసే వారి పేరిట ఉపాధి బిల్లులు పెడుతున్నారని ఎంపిటిసి ఆర్ముగం మండిపడ్డారు. మండలంలో సామాజిక తనిఖీల విషయం ప్రజాప్రతినిధులకు తెలపలేదని వైస్ ఎంపిపి పట్టాభి ధ్వజమెత్తారు. వరి, వేరుసెనగ, టమోటా పంటలకు రైతులు భీమా చేయించుకోవాలని ఎఒ అప్పోజి తెలిపారు. ఈనెల 30న మామిడి సాగుపై రైతులకు శిక్షణ తరగతులు మండల కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఉద్యానవన అధికారులు తెలిపారు. మండలంలో గాలికుంటు వ్యాధి ప్రబలకుండా పశువైద్య శిబిరాలు ఏర్పాటుచేయాలని ఎంపిటిసిలు కోరారు. సమావేశానికి అబ్కారీ శాఖ అధికారులు రాకపోవడంతో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో జడ్పీటిసి శ్రీనివాసులు, ఎంపిడిఒ ప్రేమ్‌రాజ్‌కుమార్, ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు.

## యువకుడి హత్య కేసులో నిందితుడు అరెస్ట్

వి.కోట, నవంబర్ 28 ప్రభాతవార్త



మండలంలోని కొంగాటంకు చెందిన నవాజ్ బాషా హత్య కేసులో నిందితుడ్ని అరెస్ట్ చేసినట్లు పలమనేరు డిఎస్పీ ప్రభాకర్ తెలిపారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొంగాటం పంచాయతీ సి. ఎల్లాగరంకు చెందిన నవాజ్ బాషా అలియాస్ అల్లు, సర్దార్ (47)లు స్నేహితులని చెప్పారు. ఈ నేపథ్యంలో 2021సం॥లో డబ్బు అవసరమైన నవాజ్ తనకు ఎవరివద్దనుంచి అయినా డబ్బు అప్పు తీసి ఇవ్వాలని కోరాడు. దీంతో సర్దార్ అదే గ్రామంలో ఓ మహిళ వద్ద వడ్డీకి రెండు విడతలుగా లక్ష రూపాయల నగదును అప్పుగా ఇప్పించాడన్నారు. అయితే ఈ నగదుకు సంబంధించి అసలు, వడ్డీ నవాజ్ బాషా చెల్లించకపోవడంతో అప్పు ఇచ్చిన వారు సర్దార్‌పై ఒత్తిడి తెచ్చారన్నారు. ఇది అవమానంగా భావించిన సర్దార్ నవాజ్‌బాషాను హతమార్చితే డబ్బు చెల్లించే పని ఉండదని భావించాడన్నారు. ఈ ఏడాది మేనెలలోనే ఓ సారి నవాజ్ బాషాను హతమార్చేందుకు సర్దార్ యత్నించాడన్నారు. అయితే ఈనెల 21వతేదీ రాత్రి మద్యం తాగిన నవాజ్ బాషా ఇంట్లో ఉండగా సర్దార్ తన్ని పాలారు నదిలో చేపల కోసం వెళదామని చెప్పి టువీలర్‌లో తీసుకుపోయి మామిడితోటలో మద్యం తాగించి కొయ్యతో కొట్టి చంపాడన్నారు. నవాజ్ బాషా ఇంటికి వెళ్లకపోగా అతని తల్లికి, బంధువులకు అనుమానం వచ్చి సర్దార్ ఇంటికెళ్ళగా అప్పటికే అతను పారిపోయిఉన్నాడన్నారు. అయితే తాను హత్య చేసిన విషయం మామిడి తోట యజమానికొ చెప్పినట్లు తెలిసిందన్నారు. దీంతో నిందితుడి ఆచూకీ కోసం సిఐ సోమశేఖర్‌రెడ్డి నేతృత్వంలో గాలింపు చర్యలు చేపట్టగా గురువారం వి.కోట పట్టణం కెజిఎఫ్ రోడ్‌లో హంద్రీ-నీవా కాలువ వద్ద నిందితుడు సర్దార్‌ను అదుపులో తీసుకుని విచారించగా తానే హత్యకు పాల్పడినట్లు అంగీకరించాడన్నారు. నిందితుడ్ని కోర్టుకు తరలించినట్లు చెప్పారు.

## గిరిజన రైతులకు పట్టాల మంజూరుకు చర్యలు

-గిరిజన సంక్షేమశాఖ సీనియర్ సహాయకులు మురళి

పెద్దపంజాణి, నవంబర్ 28, ప్రభాతవార్త:
అటవీ ప్రాంతంలో వ్యవసాయం చేపడుతున్న రైతులకు పట్టాల మంజూరు కోసం చర్యలు చేపడుతున్నామని గిరిజన సంక్షేమ శాఖ సీనియర్ సహాయకులు మురళి తెలిపారు. గురువారం మండలంలోని పెదకాపల్లె గ్రామ పంచాయితీ గిరిజన కాలనిలో గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ హక్కుల చట్టం 2006 ప్రకారం గిరిజన రైతులు సాగు చేసుకుంటున్న భూములకు ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు మంజూరుకు సంబందించి రెవెన్యూ, అటవీ శాఖ అధికారులతో కలసి గిరిజన రైతులతో గ్రామ సభ నిర్వహించడం జరిగిందన్నారు. అటవీ హక్కుల చట్టం గ్రామ కమిటీని 15 మంది సభ్యులతో ఏర్పాటు చేయడం జరిగిందని, కమిటీ సభ్యులు విచారణ చేపట్టి సాగులో ఉన్న రైతులను గుర్తించి వారికి పట్టాల మంజూరు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చంద్రమోహన్, అటవీశాఖ అధికారి బాలసుబ్రమణ్యం, పంచాయితీ కార్యదర్శి వినోద్ కుమార్, విఆర్ఓ సతీష్, అటవీ హక్కుల చట్టం గ్రామ కమిటీ అధ్యక్షులు నారాయణమ్మ, కార్యదర్శి ఆదిలక్ష్మీ పాల్గొన్నారు.

## బడుగుల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావ్ పూలే

- సిఎం చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి మనోహర్

కుప్పం, నవంబర్ 28 ప్రభాతవార్త



బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతిగా మహాత్మా జ్యోతిరావ్ పూలే నిలిచారని సిఎం చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి మనోహర్ పేర్కొన్నారు. గురువారం స్థానిక తెదేపా కార్యాలయంలో పూలే 135వ వర్థంతిని నిర్వహించారు. ఈసందర్భంగా మహాత్మా పూలే చిత్రపటానికి పూజలు నిర్వహించి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బిసిల అభ్యున్నతికోసం మహాత్మాపూలే ఎంతో కృషి చేశారన్నారు. బిసిలు అన్ని రంగాల్లో రాణించాలనేది ఆయన ఆశయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి సాంబశివం, కురబ కార్పోరేషన్ డైరెక్టర్ రాజగోపాల్, సలహాదారు నరేష్‌చారి, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి ఆర్ముగం, క్లస్టర్ ఇన్‌చార్జ్ ప్రతాప్, బిసి సెల్ అధ్యక్షులు జెఎంసి మురళి, సతీష్, నేతలు రామచంద్ర, విసి మంజునాథ్, వెంకటరమణ, తుల్లాభాయ్, శ్యాం సుందర్, ఇఆర్‌బి బాలాజీ, ధనశేఖర్, శివాజీ, నరేష్ తదితరులు పాల్గొన్నారు. సామగుట్టపల్లి పాఠశాలలో : మహాత్మా పూలే వర్థంతిని సామగుట్టపల్లి యుపి స్కూల్‌లో నిర్వహించారు. ఈసందర్భంగా పూలే చిత్రపటానికి పూజలు చేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమాల్లో హెచ్ఎం దీనదయాళ్, ఉపాధ్యాయులు గాలిసురేష్, సౌజన్య, గాయత్రిదేవి, శాంత, విజయనిర్మల, సరస్వతి, విద్యార్థులు పాల్గొన్నారు.

## యువ ఉత్సవ్ పోటీల్లో ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ

కుప్పం, నవంబర్ 28 ప్రభాతవార్త



చిత్తూరు ఎస్వీ సెట్ ఇంజనీరింగ్ కాలేజ్‌లో నిర్వహించిన యువ ఉత్సవ్ పోటీల్లో కుప్పం డా॥ వైసి జేమ్స్ ఎన్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజ్ విద్యార్థులు ప్రతిభ చాటి ప్రథమ స్థానం సాధించినట్లు ప్రిన్సిపాల్ డా॥జగన్నాథరావు తెలిపారు. ఫస్టియర్ విద్యార్థులు శివశంకర్, శామ్సన్‌లు రూపొందించిన లోకాస్ట్ మోటరైజ్‌డ్ ఫుడ్ ఫీడర్ ఫర్ లింబ్ లెస్ అనే ప్రయోగానికి ప్రథమ స్థానంతో పాటు 7వేల నగదు బహుమతి లభించిందన్నారు. వ్యక్తిగత విభాగంలో లోహిత్ విజేతగా నిలిచి మూడు వేల నగదు బహుమతి సాధించాడన్నారు. ఈసందర్భంగా ఉత్సవ్‌లో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డా॥ సయ్యద్ హుసేన్, జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

## బిఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ సమస్యను పరిష్కరించాలి

కుప్పం, నవంబర్ 28 ప్రభాతవార్త



కుప్పం నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో బిఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ సమస్యను పరిష్కరించాలని ఎస్‌డిఇ బాలశరవణ శంకర్ కుమార్‌ను నియోజకవర్గ జనసేన కోఆర్డినేటర్ డా॥ నరేష్ కోరారు. గురువారం స్థానిక బిఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ఎస్‌డిఇని ఆయన కలిశారు. విద్యార్థులకు ఆధార్ అప్‌డేట్, అపార్ అప్‌డేట్‌లకోసం ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించగా ఎస్‌డిఇ సానుకూలంగా స్పందించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## నేడు శ్రీ తిరుపతి గంగమ్మ ఆలయంలో విగ్రహాల సంప్రోక్షణ

కుప్పంరూరల్, నవంబర్ 28 ప్రభాతవార్త
కుప్పం గ్రామదేవత శ్రీ తిరుపతి గంగమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం విగ్రహాల సంప్రోక్షణ కార్యక్రమాలు జరుపుతున్నట్లు భక్తులు తెలిపారు. ఆలయంలో ఉన్న శ్రీ గణపతి, సప్తమాతృకలు, నాగదేవతల విగ్రహాల సంప్రోక్షణ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తులుఅధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

## పోలీస్ ట్రైనింగ్ సెంటర్ డిఎస్పీగా రాంబాబు

చిత్తూరు, నవంబర్ 28 ప్రభాతవార్త:



జిల్లా పోలీసు ట్రైనింగ్ సెంటర్ డిఎస్పీగా గురువారం జె.రాంబాబు బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన డిఎస్పీల బదిలీల్లో విజయవాడ డిజిపి కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న జె.రాంబాబును చిత్తూరు జిల్లా పోలీసు ట్రైనింగ్ సెంటర్ డిఎస్పీగా బదిలీ చేశారు. ఈ మేరకు డిజిపి కార్యాలయం నుండి వచ్చి గురువారం చిత్తూరు ట్రైనింగ్ సెంటర్ డిఎస్పీగా జె.రాంబాబు బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం డిఎస్పీ జె.రాంబాబు ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ మణికంఠ చందోలును మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు.

## పాఠశాల విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

పాలసముద్రం, నవంబర్ 28 ప్రభాతవార్త:
మండల పరిధిలోని కృష్ణజిమ్మాపురం ఎన్ఆర్ కండ్రిగ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం వైద్య ఆరోగ్యశాఖ అధికారులు రాష్ట్రీయ బాల సురక్ష కార్యక్రమంలో బాగంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిహెచ్ఓ జ్ఞానప్రకాష్ మాట్లాడుతూ పాఠశాలలో మొత్తం 271 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగిందని, పుట్టుక నుండి 18 సంవత్సరాలలోపు పిల్లల్లో లోపాలు గుర్తించి వారికి వైద్యం అందించడానికి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రీయ బాలస్వస్థ కార్యక్రమంను అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి సూపర్‌వైజర్ మురళీ, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా పాలకవర్గ సమావేశం

చిత్తూరురూరల్, నవంబరు 28 ప్రభాతవార్త:
చిత్తూరుపట్టణం, షాదీమహల్ పక్కన వున్న జిల్లా పెన్షనర్ల భవనం నందు డిసెంబరు 9వ తేది జిల్లా పాలకవర్గ సమావేశంను నిర్వహిస్తున్నట్లు సంఘ అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజ, మురుగానందంలు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా సంఘపు అభివృద్ధి, హెల్త్‌కార్డులు, లైఫ్ సర్టిఫికెట్స్ సమర్పించుట, తాలూకా యూనిట్ల నుంచి 20శాతం సభ్యత్వ వాటా, డిసెంబరు 23 నుంచి నవంబరు 24 వరకు జమా ఖర్చులు, 2025 డైరీ తదితర వాటి గురించి చర్చా సమావేశం వుంటుందనీ, పాలకవర్గ సభ్యులందరూ హాజరు కావాలని కోరారు.

## రేపు రాష్ట్ర స్థాయి సైక్లింగ్ ఎంపిక పోటీలు

చిత్తూరురూరల్, నవంబరు 28 ప్రభాతవార్త:
గుంటూరు జిల్లా, తుళ్లూరు మండలం, గుడ్రోల్ ఇంగ్లీషు మీడియం స్కూల్ నందు నవంబరు 30, డిసెంబరు 1వ తేదిలలో అండర్ 14, 16, 18 బాలబాలికలు, పురుషులు, మహిళలకు రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు చిత్తూరు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎ. బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు జిల్లా నుంచి ఆసక్తి కలిగిన వారు ఈ రాష్ట్రస్థాయి సైక్లింగ్ ఎంపిక పోటీలలో పాల్గొనవచ్చుననీ, ప్రతి ఒక్కరు వారి వారి సొంత సైకిల్‌తో పోటీలలో పాల్గొనాలనీ, ఇతర వివరాలకు కనకరావు( 9849379932), శివారెడ్డి( 9708092077)లను సంప్రదించాలని కోరారు.

**రేపు విభిన్న ప్రతిభావంతులకు క్రీడాపోటీలు**

బియస్‌కన్నన్ పాఠశాల నందు ఈనెల 30వతేది శనివారం అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవంను పురస్కరించుకొని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతులకు క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎ. బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన విభిన్న ప్రతిభావంతులు ఈ క్రీడా పోటీలలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## నేరాల అదుపుకోసమే డిజిటల్ తాళాలు : నాగేశ్వర్‌రావు

చౌడేపల్లి, నవంబర్ 28 ప్రభాతవార్త



నేరాల అదుపు కోసమే డిజిటల్ తాళాలను పంపిణీ చేస్తున్నట్లు ఎస్ఐ నాగేశ్వర్‌రావు అన్నారు. స్థానిక రామ్‌దేవ్‌జ్యులవరీస్ వద్ద డిజిటల్ తాళాలపై దుకాణ దారులకు అవగాహన కార్యక్రమం జరిగింది. దుకాణ, గృహాలవారు ఈతాళాలను వినియోగించుకోవడం వల్ల అనేక ప్రయోజనాలున్నాయన్నారు. రాత్రిళ్ళు దుకాణాలు మూసివేసే సమయంలో తాళాలు వేసుకోవడం వల్ల ఎవరైనా వాటిని తాకితే పెద్దగా శబ్దం చేస్తాయన్నారు. దీనివల్ల చుట్టుపక్కల వారు అప్రమత్త మవుతారన్నారు. దుకాణ, గృహాల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అవసరమున్నవారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

## గంగమ్మకు హుండీ ద్వారా రూ. 69.17లక్షల ఆదాయం

చౌడేపల్లి, నవంబర్ 28 ప్రభాతవార్త



శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మకు హుండీ ద్వారా రూ. 69,17,185లు ఆదాయంగా సమకూరినట్లు ఉపకమీషనర్ ఆలయ ఇఒ ఏకాంబరం తెలిపారు. కొండపై 57రోజులకుగాను హుండీ లెక్కింపు నిర్వహించగా నగదుతోపాటు 38గ్రాముల బంగారం, 350గ్రాముల వెండి, వివిధ దేశాలకు చెందిన కరెన్సీని భక్తులు కానుకలుగా సమరించారన్నారు. వీటితోపాటు రణభేరీ గంగమ్మ హుండీ ద్వారా రూ. 45,844లు ఆదాయంగా సమకూరిందన్నారు. మదనపల్లి ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ శశికుమార్, ఆలయ అధికార, అర్చక, సిబ్బంది పాల్గొన్నారు.

## ఖోఖోలో పుదిపట్ల విద్యార్థుల ప్రతిభ

పుదిపట్ల(చౌడేపల్లి), నవంబర్ 28 ప్రభాతవార్త



మండలంలోని పంచాయతీ కేంద్రం పుదిపట్ల ఉన్నతపాఠశాలలో జిల్లా జోనల్‌స్థాయి ఖోఖో క్రీడా పోటీలు జరిగాయి. సీనియర్ బాలుర విభాగంలో పుదిపట్ల మొదటి స్థానం, చౌడేపల్లి 2వ స్థానంలో నిలచారు. సీనియర్ బాలికల విభాగంలో పుదిపట్ల నిలవగా రొంపిచర్ల ద్వితీయస్థానాన్ని సాధించారు. అదే విధంగా జూనియర్ బాలుర విభాగంలో విజయవాణి స్టేట్ విద్యార్థులు మొదటిస్థానం, విజయవాణి ఐసిఎస్‌సి ద్వితీయస్థానం, జూనియర్ బాలికల విభాగంలో 1వ స్థానంలో పుదిపట్ల, 2వ స్థానంలో మేలుపట్ల విద్యార్థినిలు నిలచారు. ఖోఖో క్రీడలో జిల్లా నుంచి 25టీములు పాల్గొన్నాయి. ఎంఇఓ కేశవరెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు పద్మజ, పిఇటి రామచంద్రయ్య, పాఠశాల కమిటీ ఛేర్మన్ మనోహర్‌రెడ్డి, గ్రామస్తులు వినోద్‌కుమార్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డి, రాజారెడ్డి, లాజర్ జోనల్స్‌కు సహకరించిన వారిలో వున్నారు.

## డిప్యూటీ స్పీకర్‌ని కలిసిన ఇనాయ్ తుల్లా

కల్లూరు, నవంబర్ 28, ప్రభాతవార్త



నారావారిపల్లెలో గురువారం డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణమరాజును పులిచెర్ల మండల టిడిపి ఉపాధ్యక్షులు ఇనాయ్ తుల్లా మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడుకు నివాళులర్పించారు.

## శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

కల్లూరు, నవంబర్ 28, ప్రభాతవార్త
పులిచెర్ల మండలం దేవళంపేట శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో గురువారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో ఉదయం స్వామివారికి పంచామృత అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అర్చనలు, పూజలు జరిపి నైవేద్యం సమర్పించి మహా మంగళహారతి గావించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఫణి ప్రకాష్ శర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

# తిరుపతి డివిజన్

## ఘనంగా మహాత్మా జ్యోతిరావ్ పూలే వర్ధంతి వేడుకలు

తిరుపతి హెల్త్, నవంబర్ 28, ప్రభాతవార్త



శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం యస్.సి, యస్.టి, బిసి, మైనారిటీస్ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎం. పద్మనాభం అధ్యక్షతన సాంఘీక సంఘసంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే 135 వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. సమావేశమునకు ముఖ్య అతిధులుగా ఆచార్య వెంకటేశ్వర్లు, గోవిందులు, ఆర్ట్స్ కళాశాల సూపరింటెండెంట్ కృష్ణ కుమార్, అసిస్టెంట్ ఇంజనీర్ ఎస్. సుబ్రహ్మణ్యం హాజరై పూలే ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలని క్షుణ్ణంగా వివరించారు. ఈ సమావేశంలో కార్యదర్శి యస్ మునీశ్వరయ్య ఉపా ధ్యాయులు దార్ల రఘు రాములు, ప్రతాప్, రాజేంద్ర, శంకర్ నాయక్, అర్ తులసీరాం, అమర్ నాథ్ తదితరులు పాల్గొన్నారు.

## పారిశ్రామికవేత్తలకు టెక్నో -అవేర్నెస్ ప్రోగ్రామ్

తిరుపతి విద్య నవంబర్ 28, ప్రభాతవార్త:



పద్మావతి మహిళా వర్సిటీ టెక్నాలజీ ఔట్రీచ్ సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ కొలాబరేషన్ (టీఓసీఐసీ), ఇన్నోవేషన్ అండ్ ఫెసిలిటేషన్ ఇనిషియేటివ్ డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మహిళా పారిశ్రామికవేత్తలకు డిజిటల్ టెక్నాలజీపై అవగాహన కల్పించేందుకు టెక్నో అవేర్నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం వర్సిటీ సావేరీ సెమినార్ హాల్లో జరిగిన ఈ కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వ సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ సైంటిస్ట్ డాక్టర్ త్రిప్తా గార్గ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆమె మాట్లాడుతూ నూతన ఆవిష్కరణలు, స్టార్టప్ అవకాశాలను ప్రోత్సహించడంలో డిజిటల్ టెక్నాలజీ ప్రధాన పాత్ర పోషిస్తోందని తెలిపారు. మహిళా పారిశ్రామికవేత్తలకు సాధికారత కల్పించడంలో టెక్నో అవేర్నెస్ ప్రోగ్రాం ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ కళారాణి, డీన్ సి విజయలక్ష్మి, మోటివేషన్ స్పీకర్ కోమల రవిచంద్రన్, చెన్నై క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీదేవి, కో ఆర్డినేటర్లు, జోత్స్న, సుజాత పెద్ద సంఖ్యలో మహిళా పారిశ్రామిక వేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## టంగుటూరి ప్రకాశం పంతులు స్కూల్లో పోటీ పరీక్షలు నిర్వహణ

తిరుపతి విద్య నవంబర్ 28, ప్రభాతవార్త:



ప్రజా కళావేదిక ఆధ్వర్యంలో తిరుపతి లోని టంగుటూరి ప్రకాశం పంతులు మున్సిపల్ స్కూల్లో గురువారం నాడు వ్యాస రచనల పోటీ నిర్వహించగా ఆ పోటీలలో 9,10వ విద్యార్థులు మొత్తం 18 మంది పాల్గొ న్నారని ఈ పోటీ పరీక్షలను నిర్వహించిన ప్రజా కళావేదిక వ్యవస్థాపకులు అరవ జయపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. పోటీ పరీక్షలను నిర్వహించడంలో సహరించిన ఆ పాఠశాల ప్రధానోపధ్యా యులు, తెలుగుఉపాధ్యాయురాలైనవరలక్ష్మీతో పాటు మరో ఇద్దరు ఉపాధ్యాయులు పాలుపం చుకున్నారని ఆయన ఈ సందర్భంగా వివరించారు. ఈ పోటీ పరీక్షలపై విధ్యార్థులు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

## రాష్ట్ర స్థాయి పోటీల్లో గొల్లపల్లి విద్యార్థి ప్రతిభ

పుత్తూరురూరల్, నవంబరు 28 ప్రభాతవార్త:



పుత్తూరు మండలంలోని గొల్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న పి.లోకేశ్వరి తిరుపతి జిల్లా మంగళం ట్రేడ్స్‌లో నవంబరు 24,25,26 తేదీల్లో జరిగిన అండర్ 14 బేస్ బాల్, అంతర్ జిల్లాల పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచి ఉమ్మడి చిత్తూరు జిల్లా బంగారు పతకం సాధించడానికి తనవంతు కృషి చేసినట్లు ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు రమేష్ తెలిపారు. పోటీలో పాల్గొన్న విద్యార్థినిని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల పీడీ గోపికృష్ణ, ఉపాధ్యాయులు ఎస్.ఎస్. నాయుడు, ఏ.నరసింహులు, చంద్రశేఖర్, శ్రీరాములు, ఏకాంబరరెడ్డి, హేమావతి, ప్రభావతి, గీత పాల్గొన్నారు.

## ఆఖరి అస్త్రంగానే రసాయనాలు వాడాలి

**పుత్తూరురూరల్, నవంబరు 28 ప్రభాతవార్త:** పంటల సాగులో రసాయన ఎరువులు, మందులు ఆఖరి అస్త్రంగానే వాడాలని వ్యవసాయశాఖ జిల్లా వనరుల కేంద్రం జిల్లా ట్రైనింగ్ కో-ఆర్డినేటర్ భాస్కరయ్య కోరారు. పుత్తూరు డివిజన్ పరిధిలో పని చేస్తున్న గ్రామ స్థాయి విస్తరణ సిబ్బంది పుత్తూరు విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో శిక్షణలో ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయిలో స్థానికంగా లభించే సేంద్రియ వనరులను, పశువుల ఎరువులను, పచ్చి రొట్ట పైర్ల సాగుకు మేలైన సాగు పద్ధతుల్లో భూములకు పోషణ ఇచ్చి చీడలను అదుపు చేయవచ్చునని తెలిపారు.

## పొరుగు సేవా సిబ్బంది తొలగింపు

**శ్రీకాళహస్తి, నవంబర్ 28 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానంలో పొరుగు సేవా సిబ్బంది (క్లీనర్)గా దేవస్థానంలో పనిచేస్తున్న జి.చంద్రయ్య కొంతమంది భక్తులను తీసుకుని అడ్డదారిలో దర్శనానికి వెళ్ళి భక్తుల మనోభావాలు దెబ్బతీసే విధంగా ప్రవర్తించి విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు విధుల నుంచి తొలగిస్తూ ఇఒ టి.బాపిరెడ్డి ఆదేశాలు జారీచేశారు. శివయ్యను దర్శించుకోవాలంటే ప్రతి ఒక్కరు టిక్కెట్లు తీసుకోవాలని లేకుంటే సర్వదర్శనం క్యూలైన్లలో నుంచి వెళ్ళ వచ్చుని అంతేకానీ దళారులను అడ్డదారుల దర్శనాలకు బ్రేక్ వేస్తామన్నారు.

## బాల్య వివాహానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ

పుత్తూరురూరల్, నవంబరు 28 ప్రభాతవార్త:



పుత్తూరు మండలంలోని గోపాలకృష్ణాపురం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులకు బాల్య వివాహాల రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాల వలన కలిగే నష్టాల గురించి ప్రిన్సిపాల్ శ్రీదేవి వివరించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ గీతాంజలి మాట్లాడుతూ బాలల విద్య, హక్కులు పరిరక్షణ చేసుకోవాల్సిన అవసరం ఉందని, బాల్య వివాహాలు చేసుకోకుండా ఈ వయసులో చదువుపైన శ్రద్ధ వహించాలని విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం విద్యార్థినులతో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ లావణ్య, మహేశ్వరి, వైస్ ప్రిన్సిపాల్ చంద్రకళ, గురుకులం టీచర్స్ ధనమ్మ, సౌజన్య, భారతి, చిట్టి, గాయత్రి, సరళ, కవిత, అంగన్‌వాడీ టీచర్లు వనిత, సుమలత, వజ్రం, కామాక్షి, ధనమ్మ, భాగ్యలక్ష్మి, సుమతి, ఆశ వర్కర్ జ్యోతి పాల్గొన్నారు.

## ఘనంగా జ్యోతిరావ్ పూలే వర్ధంతి

తిరుపతి విద్య నవంబర్28, ప్రభాతవార్త:



జ్యోతిరావ్ పూలే వర్ధంతి సందర్భంగా రాష్ట్ర హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్టైల్, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖామాత్యులు ఎస్.సవిత ఆధ్వర్యంలో తిరుపతి సమీపంలో గల ప్రైవేట్ హోటల్ నందు జ్యోతిరావ్ పూలే పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా తిరుమల తిరుపతి కురబకుల సేవా సంఘం ట్యాక్సీ రథసారుధులు సుమారు 100 మంది మంత్రిని కలసి దుశాలువతో సత్కరించి, పుష్పగుచ్చం అందజేసి వినతిపత్రం అందజేయడం జరిగింది. తిరుమల కొండపైన కనకపీఠం ఏర్పాటు చేయాలని, తిరుపతిలో కరుబ భవన నిర్మాణం కొరకు స్థలం మంజూరు చేయాలని మరియు తిరుపతి ప్రధాన కూడలిలో ఏదో ఒకచోట కనకదాసు విగ్రహం ఏర్పాటుకు కృషి చేయాలని సంఘం తరుపున మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తిరుమల కనకపీఠం కొరకు ఏర్పాటుకు కృషి చేస్తానని తిరుపతిలో ఏర్పాటు కలెక్టర్ తో, ఉన్నతాధికారులతో మాట్లాడి కృషి చేస్తానని తెలియజేశారు. రాష్ట్ర యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ గండ్లూరు శ్రీనివాసులు, తిరుపతి జిల్లా అధ్యక్షులు మంగిరి రెడ్డప్ప, యూత్ అధ్యక్షులు హరినాథ్, జిల్లా ఉపాధ్యాక్షులు రఘురాం, శంకరయ్య, శ్రీనివాసులు, రెడ్డిశేఖర్, రెడ్డి సుధాకర, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## సంతాపం:

శ్రీకాళహస్తి, నవంబర్ 28 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి వి.ఎంపల్లిలో వైకాపా మద్దతు దారులు మృతి చెందటంతో మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి తనయుడు బియ్యపు ఆకర్షరెడ్డి హాజరై సంతాపం తెలిపారు. శ్రీకాళహస్తిలోని 1 వ వార్డు వైయస్ఆర్‌సిపి నాయకులు సాయి సతీమణి రాజేశ్వరి హఠాన్మరణం చెందారు. ఆమె మృతదేహానికి ఆకర్షరెడ్డి నివాళులర్పించి సంతాపం తెలిపారు.

## ఏడుగంగమ్మల జాతరకు బలవంతపు వసూళ్ళు చేస్తే కేసులు



**శ్రీకాళహస్తి, నవంబర్ 28 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి చరిత్రలో చారిత్రాత్మకంగా నిర్వహించే ధార్మిక కార్యక్రమాల్లో ఏడుగంగమ్మలు ఎంతో ప్రతిష్టాత్మకమైందని ఈ జాతరకు కొందరు బలవంతపు వసూళ్ళు చేస్తున్నట్లు తమకు ఫిర్యాదులు అందుతున్నాయని డివైయస్‌పి నరసింహామూర్తి గురువారం తెలిపారు. వచ్చేనెల 11,12 తేదుల్లో ఏడుగంగమ్మల జాతర అంగరంగవైభవంగా నిర్వహించటం ఆనవాయితిగా ఉందన్నారు. ఈ జాతరకు ఏడు గంగమ్మల ఆలయాల వద్ద ఏడు కమిటిలు ఏర్పాటు చేసుకున్నారని తమకు సమాచారం అందిందన్నారు. ఈ ఫిర్యాదులు శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డికి కూడా అందాయని జాతర సంబరాలు సందర్భంగా శాంతి భద్రతలను కట్టుదిట్టంగా ఏర్పాటు చేయాలన్నారు. బలవంతపు వసూళ్ళతో ప్రజలు ఇబ్బంది పడకూడదు. వ్యాపారులు నొచ్చుకోరాదని డివైయస్‌పి వివరించారు. తమకు ఎవరైనా ఫిర్యాదులు చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

***ప్రశాంతంగా జరుపుటకు సహకరించాలి:***

శ్రీకాళహస్తిలోఏడుగంగమ్మల జాతరను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుటకు కమిటీలు, ప్రజలు పోలీసులతో సహకరించాలని డివైయస్‌పి నరసింహామూర్తి వివరించారు. చాటింపు నుంచి నిమజ్జనం వరకు అంగరంగవైభవంగా నిర్వహించాలని అయితే అనవసర వివాదాలు, ఘర్షణలు ఉండరాదన్నారు.

## తహశీల్దార్‌ను సత్కరించిన న్యాయవాదులు

శ్రీకాళహస్తిరూరల్, నవంబర్ 28 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి తహశీల్దార్ లక్ష్మీనారాయణను గురువారం సీనియర్ న్యాయవాది కెవి రమణారావు సారధ్యంలో సత్కరించారు. శ్రీకాళహస్తి మండలం విస్తృతమైనదని ఇక్కడ సేవలందిస్తున్న లక్ష్మీనారాయణ అభినందనీయుడన్నారు. తహశీల్దార్‌ను దుశ్శాలువతో సత్కరించి శ్రీకాళహస్తీశ్వరుని తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమాల్లోదావాల శ్రీనివాసులు, మాజీ కౌన్సిలర్ రామచంద్రయ్య, పి. శ్రీనివాసులు పాల్గొన్నారు.

## ఘనంగా జ్యోతిరావు పూలేకు నివాళులు

తొట్టంబేడు, నవంబర్ 28 ప్రభాతవార్త



మండలంలోని గుండేలిగుంట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహాత్మాజ్యోతిరావు పూలేవర్ధంతి కార్యక్రమాన్ని హెచ్‌ఎం మునితి రుమలయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్య క్రమం గురించి సాంఘికశాస్త్ర ఉపాధ్యా యులు బి.చెంచయ్య మాట్లాడుతూ సమాజంలో అట్టడుగు వర్గాలు అయినటువంటి దళితుల కోసం పాఠశాలలను స్థాపించిన దార్మనికుడు జ్యోతిరావు పూలే అన్నారు. గణిత ఉపాధ్యాయులు మునీశ్వరరెడ్డి మాట్లాడుతూ మహాత్మాజ్యోతిరావు పూలే సంఘాన్ని పట్టిపీడిస్తున్న మూడచారాలను మూడనమ్మకాలను ఎదిరించి దళితులను కాపాడిన సంఘ సంస్కర్త మరియు మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మస్తాన్‌రావు, రమాదేవి, భాస్కరయ్య, శ్రీకర్, జయసింహ, డిల్లీబాబు పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## రెడ్డీస్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో సభ్యత్వనమోదు

.తొట్టంబేడు, నవంబర్ 28 ప్రభాతవార్త



మండలంలోని పెద్దకన్నలి గ్రామంలో శ్రీకాళహస్తి రెడ్డీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం సభ్యత్వనమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. శివాలయంలోపూజలు నిర్వహించి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహించారు. రెడ్డీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చెంచురెడ్డి మాట్లాడుతూ కన్నలి నుంచి ప్రారంభమైన సభ్యత్వ నమోదు కార్యక్రమం త్వరలోనే శ్రీకాళహస్తి నియోజకవర్గం మొత్తం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కన్నలి గ్రామంలోని రెడ్డి సోదరులు, ఇతర గ్రామాల్లోని రెడ్డి సోదరులు మరియు రెడ్డీస్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## డిసెంబర్ నెల ఫించన్లు ఒక్కరోజు ముందు పంపిణీ

తొట్టంబేడు, నవంబర్ 28 ప్రభాతవార్త

డిసెంబర్-2024 నెలలో 1వ తేదీ ఆదివారం రావడడంతఓ సామాజిక భద్రత ఫించన్లు పంపిణీ ప్రభుత్వం ఆదేశాలు మేరకు ఒక్క రోజు ముందుగానే నవంబర్ 30వ తేదీన శనివారం గ్రామాల్లోనే పంపిణీచేయడం జరుగుతుంద ఎంపిడిఓ సురేంద్రనాథ్ తెలిపారు. మండలంలోని ప్రజలు అందుబాటులో ఉండి పెన్షన్ నగదు తీసుకోవాల్సిందిగా కోరారు.

## అసలైన సత్యశోధకుడు మహాత్మాపూలే



-తెదేపా బిసి విభాగం

తొట్టంబేడు, నవంబర్ 28 ప్రభాతవార్త

భారతీయ సంస్కృతిలో వేల్లూనుకుపోయిన కులవ్యవస్థను అంటరానితనం అనే జాఢ్యం నుంచి సమాజాన్ని కాపాడి అన్ని వర్గాల ప్రజలకు సమాన హక్కులను సాధించడానికి సత్యశోధక్ సమాజ్ అనే సంస్థను స్థాపించి తన అనుచరుల సాయంతో గొప్ప సామాజిక విప్లవానికి శ్రీకారం చుట్టిన అసలైన సత్యశోధకుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని తెలుగుదేశం పార్టీ బిసి విభాగం నాయకులు కొనియాడారు. స్వాతంత్ర్యానికి పూర్వం భారతీయ సమాజంలో అగ్ర కులాల కబంధ హస్తాలలో బానిస బతుకులను అనుభవిస్తున్న బడుగు బలహీన వర్గాల ప్రజల్లో చైతన్య తీసుకువచ్చి వారికి సమాజంలో అందరితో సమానంగా జీవితాలను అనుభవించడానికి ఎన్నో సాంఘిక ఉద్యమాలను నడపిన మహోన్నత వ్యక్తి పూలే అని కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్‌రవి, తెలుగుదేశంపార్టీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ యం.ఉమేష్‌రావు, సాంస్కృతిక రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్ళూరుబుజ్జి, బిసి విభాగం తిరుపతి పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి యంయస్.రెడ్డి, ఉపాధ్యక్షుడు పేట బాలాజీరెడ్డి, నాయిబ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోటచంద్రశేఖర్, నాయకులు మునిరాజయాదవ్, టిఎన్‌టియుసి అధ్యక్షుడు వెంకటేశ్వరచౌదరి, శివారెడ్డి, సునీల్, కృష్ణమూర్తి, శేఖర్, రమేష్, మునిరాజరెడ్డి, భాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ భవన్‌లో మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి

శ్రీకాళహస్తి, నవంబర్ 28 ప్రభాతవార్త



స్వర్గీయ మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్బంగా శ్రీకాళహస్తి అంబేద్కర్ భవన్‌లో ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జ్యోతిరావుపూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘననివాళులుఅర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి తాలూకా ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.చెంచయ్య మాట్లాడుతూ పేద బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి నిరంతర శ్రామికుడు పేదల అభ్యున్నతికి నిరంతరం కృషిచేసిన స్వర్గీయపూలే ఆశయ సాధన కోసం నిరంతరం శ్రమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొని నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కె.వెంకటాద్రి, బి.సురేష్‌బాబు, జి.గజేంద్రరెడ్డి, పి.గజేంద్రశ్రీహరి, సుబ్బారాయుడు, గోవిందయ్య, గోపి తదితరులు పాల్గొన్నారు.

## బాల్యవివాహ రహిత సమాజం నిర్మిద్దాం

.తొట్టంబేడు, డిసెంబర్ 28 ప్రభాతవార్త




బాల్యవివాహ రహిత సమాజం నిర్మించేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని ప్రగతి సంస్థ డైరెక్టర్ కెవి.రమణ పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తి ప్రెస్‌క్లబ్‌లో జరిగిన గురువారం ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. కేంద్రప్రభుత్వం చేపట్టిన బాల్ వివాహ్ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా శ్రీకాళహస్తి, తొట్టంబేడు, కెవిబిపురం మండలాల్లో 50గ్రామాల్లో 2,350 ప్రజలు ప్రతిజ్ఞ చేశారన్నారు. శ్రీకాళహస్తిలో మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా జరిగే బాల్యవివాహాల గురించి 2006లో పత్రికలు వెలుగులోకి తెచ్చాయన్నారు. నాడు శ్రీకాళహస్తిలో ప్రారంభమైన ఉద్యమం నేడు దేశ వ్యాప్తంగా జరుగుతోందన్నారు. ఇందులో భాగంగానే కేంద్రప్రభుత్వం బాల్ వివాహ ముక్త్ భారత్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ప్రగతి సంస్థ 2023-24లో సుమారు 120 బాల్య వివాహాలను ఆపిందన్నారు. బాలల హక్కుల పరిరక్షణ కోసం దేశ వ్యాప్తంగా పనిచేస్తున్న 250కి పైగా ఎన్జీవోల జాతీయ కూటమిలో ప్రగతి సంస్థ కూడా ఒకటి అని కెవిరమణ తెలిపారు. ఓపెన్ పదోతరగతి పరీక్ష రాయించి టైప్ రైటింగ్, కంప్యూటర్ విద్యను నేర్పించారన్నారు. ప్రగతి సంస్థ సహకారంతో నేడు తాను సమాజంలో ఇద్దరు ఆడబిడ్డలతో ధైర్యంగా జీవనాన్ని కొనసాగిస్తున్నానన్నారు. తనలాగే ప్రతిఒక్కరు బాల్య వివాహాలు వ్యతిరేకించాలని శైలజ కోరారు. సమావేశంలో విన్స్ డైరెక్టర్ మీరా, ప్రాజెక్టు కో ఆర్డినేటర్ రాజారెడ్డి, కమ్యూనిటీ సోషల్ వర్కర్లు మధుకుమార్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

## నడక మార్గంలో అక్రమ దుకాణాలు తొలగించాలి

### అఖిల భారతీయ యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు ఆర్ఆర్ యాదవ్

తిరుపతి హెల్త్, నవంబర్ 28, ప్రభాతవార్త



గత వైసిపి ప్రభుత్వంలో అలిపిరి నడక మార్గంలో ఏడవ మైలు వద్ద ఫారెస్ట్ అధికారులచే అక్రమంగా నిర్మాణం చేసుకున్న దుకాణాలను తొలగించాలని అఖిల భారతీయ యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు, తెలుగుదేశం పార్టీ నాయకులు ఆర్.ఆర్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. నారా రామమూర్తి నాయుడు కర్మ క్రియలకు హాజరయ్యేందుకు తిరుపతికి విచ్చేసిన టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్ల శ్రీనివాస్ రావును గురువారం ఓ ప్రైవేటు హోటల్లో ఆర్ఆర్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. అక్రమంగా నిర్మాణానికి సహకరించిన టిటిడి అధికారులపై చర్యలు తీసుకోవాలని వినతి అందజేశారు. నడకదారిలో దుకాణాల ఏర్పాటుకు టీటీడీ అనుమతి ఇవ్వకుండానే ఫారెస్ట్ అధికారులు వైసీపీ నాయకులతో కుమ్మక్కై అక్రమ దుకాణాలు ఏర్పాటు చేశారన్నారు. వీటి వెనక ఫారెస్టు అధికారుల హస్తం ఉందని, వారికి కావాల్సింది తీసుకొని అక్రమ అనధికార దుకాణాలు ఏర్పాటుకు సహకరించారన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం వీటిపై విచారణ చేపట్టి అక్రమ కట్టడాలను తొలగించాలని డిమాండ్ చేశారు. దీనిపై టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్ల శ్రీనివాస్ రావు స్పందిస్తూ అక్రమ అనధికార దుకాణాలను తొలగించేందుకు టీటీడీ అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

## అణగారిన వర్గాల ఆరాధ్యుడు "జ్యోతీరావ్ పూలే"

### బి.సి.హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ ఫహమదున్నీసా, మాలతి

చంద్రగిరి, నవంబర్ 28 ప్రభాతవార్త:



దివంగత మహాత్మా జ్యోతీరావ్ పూలే అణగారిన వర్గాల ఆరాధ్యుడు అని బి.సి.హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ ఎస్.ఫహమదున్నీసా, టి.మాలతి కొనియాడారు. స్థానిక ఇంటిగ్రేటెడ్ బి.సి. బాలికల వసతి గృహంలో గురువారం జ్యోతీరావ్ పూలే వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనకు, మహిళల అభివృద్ధికి ఆయన ఎనలేని సేవలందించారని అన్నారు. అదేవిధంగా పూలే సతీమణి సావిత్రిబాయి పూలే మహిళలకు విద్యను అందించడంలో మార్గదర్శకురాలుగా నిలిచారని అన్నారు. ఈ కార్యక్రమంలో బిసి బాలికల హాస్టల్స్ సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

## అణగారిన వర్గాల ఆశాజ్యోతి పూలే -వీసీ సీహెచ్ అప్పారావు

తిరుపతి విద్య నవంబర్ 28, ప్రభాతవార్త:



మహాత్మా జ్యోతిరావు పూలే మహా సంఘ సంస్కర్త, అణగారిన వర్గాల ఆశాజ్యోతి అని వీసీ సీహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు పేర్కొన్నారు. పూలే వర్ధంతి సందర్భంగా బుధవారం వర్సిటీ పరిపాలన భవనంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ సమసమాజ స్థాపనకోసం నిరంతరం కృషి చేసిన మహనీయుడని, పూలే గురించి తెలుసుకోవడమంటే ఆధునిక భారతదేశ సామాజిక వ్యవస్థను తెలుసుకోవడమేనని, నిమ్న వర్గాలకు, మహిళలకు విద్యను అందించాలని ప్రత్యేక పాఠశాలను ప్రారంభించిన మహనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఓబీసీ ఫోరం సభ్యుడు, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ, ఇంజనీర్ తాండవ కృష్ణ, ప్రొఫెసర్ చంద్రశేఖరయ్య డాక్టర్ పత్తిపాటి వివేక్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## తిరుపతి ఎక్సైజ్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన అసిస్టెంట్ కమీషనర్

తిరుపతిరూరల్, నవంబర్ 28 ప్రభాతవార్త:



తిరుపతిరూరల్ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ స్టేషన్‌ను గురువారం ఎక్సైజ్ అసిస్టెంట్ కమీషనర్ శ్రీనివాసాచారి ఆకస్మిక తనిఖీ చేసారు. ఎక్సైజ్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. గంజాయి, డ్రగ్స్ రవాణా అమ్మకాల నియంత్రణపై పలు సూచనలు సలహాలు తెలియజేసారు. నాటు సార, ఎన్‌డిపిఎల్‌లపై రివ్యూ చేసి నమోదు కేసు చేసి కేసులను పెంచి, నేరాలను అదుపు చేయాలన్నారు. ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నేరాలు అదుపు చేయాలని ఆదేశించారు. పాత నేరస్తులను అదుపు చేసి బైండోవర్ చేయాలని ఆదేశించారు. తిరుపతిరూరల్ పరిధిలో బెల్ట్‌షాపులపై అధిక ఫిర్యాదులు అందుతున్నాయని, బెల్ట్ షాపులను నివారించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సి.ఐ. నరసానాయుడు, ఎస్.ఐ. కవీశ్వర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజలందరికీ మంచి జరగాలి

తిరుమల, నవంబర్ 28ప్రభాతవార్తప్రతినిధి:

శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ మంచి జరగాలని వేడుకున్నట్లు చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు, చిత్తూరు మేయర్ కఠారి హేమలత తెలిపారు. గురువారం ఉదయం స్వామివారి మూలవిరాట్టును దర్శించుకున్నారు.

## అసమానత నిర్మూలనకు పూలే కృషి

తిరుపతి(రవాణా), నవంబర్ 28ప్రభాతవార్త:



సమాజంలో అసమానతలు నిర్మూలనకు సంఘ సంస్కర్త మహాత్మాజ్యోతిరావు పూలే కృషిచేశారని బిజెపి నాయకులు అన్నారు. పూలే వర్ధంతిని గురు వారం ఉదయం పూలే విగ్రహానికి బిజెపి నాయకులు గుండాల గోపీనాధరెడ్డి, కట్టమంచి చంద్రబాబు, సుబ్రమణ్యంయాదవ్, సుబ్రమణ్యంరెడ్డి, చోంగారెడ్డి తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్‌పిడిసిఎల్ పరిధిలో కార్పొరేట్ కార్యాలయంలో పూలే చిత్రపటానికి సిఎండి సంతోషరావు, ఉద్యోగులు పుష్పాంజలి ఘటించారు.

## సాయిబాబా మందిరంలో భక్తులకు అన్నదానం

తిరుపతి హెల్త్, నవంబర్ 28, ప్రభాతవార్త



తిరుపతిలోని కొంకావీధిలోని సాయిబాబా మందిరంలో శ్రీసాయి బాబా విగ్రహం ప్రతిష్టించి 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం మందిరం వద్ద సుమారు వెయ్యి మంది భక్తులకు అన్నదానం చేశారు. దీనికి ముందు మందిరంలో శ్రీ సాయి బాబాకు శ్రీద్వారకామాయి శ్రీ షిరిడి సాయిబాబు సేవా సమాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సేవా సమాజ్ ప్రతినిధులు మబ్బు దేవనారాయణరెడ్డి, కుడితి సుబ్రమణ్యం, దుర్గం శ్రీనివాస్, మర్ధం శివ, సి. రమేష్, పి. విజయలక్ష్మి, హరిబాబు, గణేష్, తిరుమలయ్య, దశరథ, ప్రభాకర్, ఆనంద్ భక్తులు పాల్గొన్నారు.

## చెన్నై భక్తులకు విలువైన బ్యాగ్ అప్పగింత



తిరుమల, నవంబర్ 28ప్రభాతవార్తప్రతినిధి:

శ్రీవారి దర్శనానికి వెళ్ళే సమయంలో గోవిందసాయి విశ్రాంతి భవనం కౌంటర్‌వద్ద అమెరికన్ డాలర్లు ఉన్న సంచిని మరచివెళ్ళిన యాత్రికులకు పద్మావతివిచారణ కార్యాలయం సిబ్బంది తిరిగి అప్పగించారు. గురువారం ఉదయం చెన్నైకి చెందిన సెల్వరాజు కుటుంబం గోవిందసాయి కౌంటర్ వద్ద టీతాగి బ్యాగ్‌ను వదలివెళ్ళారు. అక్కడ సిబ్బంది గమనించి జూనియర్ అసిస్టెంట్ రెడ్డి భాస్కర్ పద్మావతి సూపరింటెండెంట్‌కు అందజేశారు. అందులోని చిరునామా మేరకు భక్తులకు అప్పగించి నిజాయితీతో బాటు భక్తుల్లో సంతోషం గమనించారు.

## ఆకాశదీపాన్ని ఆవిష్కరించిన ఇఓ సతీమణి

శ్రీకాళహస్తి, నవంబర్ 28 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక మాసం సందర్బంగా సోమవారం భక్తి శ్రద్దలతో ఆకాశ దీపాన్ని ఆవిష్కరించారు. కార్తీక మాసం సందర్బంగా ఆలయాన్ని దీపాల కాంతితో దేదీప్యమానంగా మారింది. మహిళా భక్తుల మనోగతం మేరకు ఆలయం పరిసరాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేసారు. ఆలయంలోని కోట మండపం వద్ద ఆలయ ఇఓ టి.బాపిరెడ్డి సతీమణి టి.రాధా పాల్గొని ఆవిష్కరించారు. ఉదయం నుంచి ఆలయంలో సామాన్య భక్తులు, మరో వైపు విఐపిల తాకిడి పెరుగుతుంది. కోట మండపం వద్ద స్థానిక మహిళా భక్తులు విశేషంగా హాజరు కాగా అలయాధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. వేదపండితులు వేద మంత్రాలను పఠిస్తుండగా పౌరోహితులు అర్ధగిరి స్వామి శాస్త్రోక్తంగా పూజలు జరిపారు. ఆలయ డెప్యూటి ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ సురేష్‌రెడ్డి, ఈ కార్యక్రమాల్లో పలువురు పట్టణ ప్రముఖులు, దఫేదార్ దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## జ్యోతిరావు పూలే సేవలు చిరస్మరణీయం

### తిరుపతి మేయర్ డాక్టర్ శిరీష, ఎమ్మెల్సీ సిపాయి



తిరుపతి కార్పొరేషన్, నవంబర్ 28, ప్రభాతవార్త

మహాత్మ జ్యోతిరావు పూలే 134 వర్ధంతి సందర్భంగా గురువారం తిరుపతి బాలాజీ కాలనీ కూడ తిరుపతి లో నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, బీ.సి. సంఘర్షణ సమితి సభ్యులు జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మేయర్ డాక్టర్ శిరీష మాట్లాడుతూ అణగారిన వర్గాల ఆశాజ్యోతి, సమసమాజ స్థాపన కోసం నిరంతరం కృషి చేసిన మహనీయుడు మహాత్మ జ్యోతిరావు పూలే అని తెలియజేశారు. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, మహాత్మ జ్యోతి పూలే సేవలు చిరస్మరణీయం ఆదర్శనీయం తెలియజేశారు. మమతానురాగాల మహనీయ సమాజ స్థాపన కోసం అహర్నిశలు కృషి చేశాడని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘర్షణ సమితి సభ్యులు లక్ష్మయ్య యాదవ్, సాకం ప్రభాకర్, అశోక్ సామ్రాట్ యాదవ్, కేబుల్ రమణ, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## సిఎం చంద్రబాబుకు ఘన స్వాగతం



### మాజీ ఎమ్మెల్యేకు నివాళి

నారాయణవనం , నవంబర్ 28 ప్రభాతవార్త :

రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు బుధ వారం రాత్రి తిరుపతి విమానాశ్రయానికి వచ్చారు. ఈ సందర్భంగా సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆది మూలం సిఎం చంద్రబాబుని విమానాశ్రయంలో మర్యాద పూర్వకంగా కలిసి ఘన స్వాగతం పలికారు. గురువారం సిఎం చంద్రబాబు సోదరుడు, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే అయిన నారా రామమూర్తినాయుడు చిత్ర పటానికి వారి స్వగ్రామం నారావారిపల్లెకు వెళ్లి నివాళి అర్పించారు. అనంతరం సిఎంను కలిశారు. ఆయనతో పాటు జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్‌కుమార్, టిడిపి నాయకులు పాల్గొన్నారు

## 7న జరిగే మెగా పేరెంట్స్, టీచర్ల మీటింగ్‌ని విజయవంతం చేయండి

నారాయణవనం, నవంబర్ 28 ప్రభాతవార్త :



వచ్చే నెల 7వ తేది జరిగే పేరెంట్స్, టీచర్ల మెగా సమావేశాన్ని విజయవంతం చేయాలని పుత్తూరు డిప్యూటీ డిఇఓ, ఎంఇఓ-1 ప్రభాకర్‌రాజు, ఇంచార్జ్ ఎం పిడిఓ గుణశేఖర్‌లు కోరారు. వారు మాట్లాడుతూ 7వ తేది మధ్యాహ్నం 3గంటలకు ఈ సమావేశం జరుగుతుందని, టీచర్లు, విద్యార్థుల తల్లితండ్రులు తప్పక హాజరుకావాలని కోరారు. కావున టీచర్లు, హెడ్‌మాస్టర్లు ఈ సమాచారాన్ని తల్లితండ్రులకు తెలియజేసి తీసుకురావాలని కోరారు.

## సీపీఎం మహాసభలు జయప్రదం చేయండి

సత్యవేడు, నవంబరు 28 ప్రభాతవార్త:



సత్యవేడులో డిసెంబరు 1,2 తేదీల్లో నిర్వహించనున్న సీపీఎం జిల్లా మహాసభలు అన్ని సమస్యలపై ప్రజలకు ఒక దిక్సూచి కాబోతున్నట్టు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి, వర్గ సభ్యులు దాసరి జనార్ధన్ పేర్కొన్నారు. గురువారం స్థానిక సీపీఎం పార్టీ కార్యాలయంలో సీపీఎం మండల కార్యదర్శి రమేష్ అధ్యక్షతన సీపీఎం జిల్లా మహాసభలపై ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దాసరి జనార్ధన్ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల సమస్యలు ప్రతిభమించేటట్టు జిల్లా మహాసభలు జరుగుతుందన్నారు. ప్రధానంగా శ్రీసిటీ ప్రాంతంలో నడుస్తున్న పలు పరిశ్రమలకు సంబంధించి కార్మికులకు ఎదురవుతున్న సమస్యలను మహాసభలో ప్రస్తావిస్తామన్నారు. ఇప్పటికే మ్యాన్ పవర్ ఏజెన్సీ కొందరు కార్మికులకు అందాల్సిన పీఎఫ్ సక్రమంగా చెల్లించడం లేదన్నారు. దీంతో పాటు దళితులు, రైతులు, విద్యార్థులు తదితర అన్ని వర్గాల సమస్యలపై కూలంకషంగా చర్చిస్తామన్నారు. సత్య వేడు వీఎంకే కల్యాణ మండపంలో జరగనున్న సీపీఎం జిల్లా మహాసభలకు ముఖ్య అతిథిగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, ప్రధాన ఉపన్యాసాలుగా మాజీ రాజ్యసభ సభ్యులు పెనుమల్లి మధు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మూలం రమేష్, సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళి, తదితరులు హాజరుకానున్నట్టు ఆయన వివరించారు.

## ఘనంగా పూలే వర్ధంతి వేడుకలు

సత్యవేడు, నవంబరు 28 ప్రభాతవార్త:



మహాత్మ జ్యోతిబాపూలే వర్ధంతి వేడుకలను గురువారం స్థానిక ఎంజేపీబీ బాలుర గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో జ్యోతి బా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారుప్రిన్సిపాల్ శ్రీనివాసులుమాట్లాడుతూ జ్యోతి బాపూలే భారతదేశంలో బాలిక విద్యను ప్రోత్సహించి, సాంఘిక దురాచారాలను నిర్మూలించేందుకు పెద్ద ఎత్తున ఉద్యమాలను నడిపిన సంఘసంస్కర్త అని తెలిపారు. విద్యార్థులు పూలే జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ఉన్నత స్థానాలు ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్, సభ్యులు పాల్గొన్నారు.

## 30న ఎన్‌టీఆర్ పెన్షన్ల పంపిణీ

కేవీబీపురం, నవంబరు 28 ప్రభాతవార్త:

కేవీబీ పురం మండలంలోని 39 గ్రామ పంచాయతీల్లో నవంబరు 30 తేదీనే సామాజిక భద్రత పెన్షన్లను పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో రాధారాణి తెలిపారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో పెన్షన్ పంపిణీపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రతినెల 1వ తేదీన పంపిణీ చేస్తున్న సామాజిక భద్రత పెన్షన్ పంపిణీ డిసెంబరు 1న ఆదివారం కావడంతో ముందస్తుగానే నవంబరు 30న ఉదయం ప్రతి ఇంటికి వెళ్లి లబ్ధిదారులకు పెన్షన్ పంపిణీ చేసే విధంగా చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బీసీ హాస్టల్లో మహాత్మ జ్యోతిబాపూలే వర్ధంతి వేడుకలు



బుచ్చినాయుడు కండ్రిగ, నవంబరు 28 ప్రభాతవార్త:

బీసీ బాలుర సంక్షేమ హాస్టల్లో మహాత్మ జ్యోతిబా పూలే వర్ధంతి వేడుకలను బీసీ బాలుర సంక్షేమ హాస్టల్లో వార్డెన్ రామయ్య ఆధ్వర్యంలో చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అవిశ్రాంతంగా కృషి చేసిన మహనీయుడని, సామాజిక సంస్కకర్త మహిళ విద్యాభివృద్ధికి మార్గదర్శిగా నిలిచిన నిత్య స్ఫూర్తి దాత జ్యోతిబా పూలే అని కొనియాడారు. కార్యక్రమంలో హాస్టల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## వైఎస్ జగన్ కలసిన జేసీఎస్ కన్వీనర్ రాకేష్



**బుచ్చినాయుడు కండ్రిగ, నవంబరు 28 ప్రభాతవార్త:** తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా వైసీపీ తిరుపతి జిల్లా సోషల్ మీడియా కో-కన్వీనర్ వేలూరు రాకేష్ గురువారం కలసి పూల బొకేఅందించారు. సత్యవేడునియోజకవర్గం పలు విషయాలపై జగన్‌కి విన్నవించుకోవడం జరిగిందన్నారు.

## జనవాణిలో అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి కార్పొరేషన్, నవంబర్ 28, ప్రభాతవార్త



మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం జరిగిన జనవాణి కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులను ఆరణి శ్రీనివాసులు స్వీకరించారు. వినతులను స్వీకరించడమే కాకుండా సంబంధిత అధికారులకు ఫోన్ చేసి ఆ సమస్యలు పరిష్కరిం చాలని ఆయన కోరారు. శుక్రవారం కూడా జనవాణి కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు పసుపులేటి హరిప్రసాద్, నగర అధ్యక్షులు రాజారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి కీర్తన, న్యాయవాది గాలి శ్రీనివాసులు, నైనార్ శ్రీనివాస్, రాయల వంశీ, బాబ్జి, సునీల్ చక్రవర్తి, సాని శ్రీనివాస్, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం చంద్రబాబును కలసిన బిజెపి భాను



**తిరుపతి, నవంబర్ 28ప్రభాతవార్త:** సోదరుడు కర్మక్రియల్లో పాల్గొన్న సిఎం చంద్రబాబునాయుడును టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. నారావారిపల్లిలో గురువారం ఉదయం కలిశారు.

**CHANGE OF NAME**

I,SALLAGUNTA LAKSHMIPATHY (Old Name), R/at CHERLOPALLI, PUTTUR,TIRUPATI DT, A.P. I have Changed My name as (New Name) SALLAGUNTA LAKSHMIPATHI S/O SALLAGUNTA ADINARAYANA.

## ఇంటింటి సర్వేను పక్కాగా నిర్వహించాలి



డక్కిలి,నవంబరు 28 ప్రభాతవార్త : డక్కిలి మండలంలో జరుగుతున్న ఇంటింట సర్వేను పక్కాగా న్విహించాలని డక్కిలి ఎంపీడీవో టి.గుణశేఖర్‌రెడ్డి తెలిపారు. మండలంలో గత కొన్ని రోజులు నుంచి జరుగుతున్న ఇంటింట సర్వేను గురువారం ఎంపీడీవో పలుగోడు, నాగవోలు.లింగసముద్రం,వెంబులూరు గ్రామాల్లో జరుగుతున్న సర్వేను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన సర్వే సిబ్బందికి తగు సలహాలు ఇచ్చారు. సర్వేను త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేయాలని తెలిపారు.సర్వేలో అలసత్వం ప్రదర్శిస్తే వారిపై ఉన్నతాధి కారులకు ఫిర్యాదు చేసి తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈకార్య క్రమంలో ఆయన వెంట జూనియర్ సహాయకుడు చరణ్‌తేజ ఉన్నారు.

# గూడూరు డివిజన్

## మధ్యాహ్న భోజనంలో మార్పులు



కోట,నవంబర్ 28 ప్రభాతవార్త :ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు కోరుకునే ఆహారానికి ప్రాధాన్యమిస్తూ మధ్యాహ్న భోజన పథకంలో మెనూలో కూటమి ప్రభుత్వం మార్పులు తీసుకొచ్చిందని కోట మండల ఎంఇఒ2 మస్తానయ్య అన్నారు. గురువారం ఆయన చిట్టడేలోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకంను పరిశీలించారు. విద్యార్థులందరూ పాఠశాలలోనే మధ్యాహ్న భోజనం తినేలా నూతన మెనూ రూపకల్పన చేసిందన్నారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయులు సంపూర్ణమ్మ, ఉపాధ్యాయులు ఉన్నారు.

## జ్యోతిరావుపూలే సేవలు చిరస్మరణీయం



కోట,నవంబర్ 28 ప్రభాతవార్త : జ్యోతిరావుపూలే సేవలు చిరస్మరణీయమని ఉమ్మడి నెల్లూరు జిల్లా ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి అధ్యక్షులు మీజారు మాదవ్ అన్నారు. గురువారం జ్యోతిరావుపూలే వర్ధంతిని పురస్కరించుకుని కోటలోని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళిర్పించారు. ఈ సందర్భంగా మాదవ్ మాట్లాడుతూ దేశం గర్వించదగ్గ సంఘ సంస్కర్తల్లో జ్యోతిరావుపూలే ముందు వరుసులో ఉంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లీగల్ సేల్ అడ్వైజర్ అశోక్ క్లాంబ్లీ వెంకటరమణయ్య,కార్యదర్శి పాలమల్లి, సహాయ కార్యదర్శి, పనబాక హేమంత్, ఏడుకొండులు,దేవా, ప్రేమ కుమార్, శ్రీను, రాయపు సురేష్,తదితరులుయ పాల్గొన్నారు.

## వామ్మో చలిగాలిలు...చలికి వణుకుతున్న ప్రజలు

నాయుడుపేట టౌన్ నవంబరు 28 ప్రభాతవార్త : బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెంగాల్ తుపాన్ ప్రభావంతో సూళ్ళూరుపేట నియోజకవర్గంలో బుధవారం నుండి చలిగాలిలు విపరీతంగా వీస్తుండటంతో పట్టణ-గ్రామీణ ప్రజలు వామ్మో చలి అంటూ గజగజ వణుతున్నారు.తుపాన్ ప్రభావంతో గత మూడురోజుల నుండి నాయుడుపేటలో తేలికపాటి వర్షాలు పడుతున్నాయి.ఈతేలికపాటి వర్షాలకుతోడు చలిగాలిలు విపరీతంగా తోలడంతో ప్రజలు చలి అంటూ ఇంటినుండి బయటకు రాలేక అవస్థలు పడుతున్నారు.ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు చలిగాలికి గజగజ వణుకుతున్నారు.తుపాన్ ప్రభావం మరో రెండురోజులు ఉండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

## మహిళల్లో ఆత్మస్థైర్యం పెంపొందిద్దాం



కోట,నవంబర్ 28 ప్రభాతవార్త : మహిళలు,బాలికల్లో ఆత్మసెర్యాన్ని పెంపొందించే దిశగా ప్రతి ఒక్కరు ముందుడు వేయాలని కోట ఐసిడిఎస్ ప్రాజెక్టె అధికారిణి మునికుమారి అన్నారు.గురువారం కోటలోని స్థానిక ప్రాజెక్ట్ కార్యాలయాంలో జరిగిన సెక్టార్ సమావేశంలో ఆమె మాట్లాడారు. బాల బాలికలకు వివక్ష చూపకుండా విద్య నేర్పించాలని కోరారు.దేశంలో 11 నుంచి 18 ఏళ్ల లోపు ఉన్న వాన్న వారి జనాభా 20 శాతం ఉందన్నారు. వీరే దేశ భవిష్యత్తును నిర్ధారిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్లు, అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## 8న సాగునీటి సంఘాల ఎన్నికలు

కోట,నవంబర్ 28 ప్రభాతవార్త : కోట మండలంలోని 20 సాగు నీటి సంఘాలకు డిసెంబర్ 8న ఎన్నికలు జరుగునున్నట్లు కోట మండల నీటిపారుదలశాఖ ఇంజినీర్ మునిరత్నం తెలిపారు.ఆయన గురువారం ప్రభాతవార్తతో మాట్లాడుతూ ఇప్పటికి ఓటర్ల జాబితా సిద్ధమైందన్నారు.ఎన్నికల సందర్భంగా ఒక్కో సాగు నీటి సంఘం పరిధిలోని 12 మంది టిసీలను (టెరిటోరియల్ కానిస్టేన్సీ) ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. వారి నుంచి అధ్యక్ష, కార్యదర్శులను ఎన్నుకోవడం జరుగుతుందన్నారు.

## పేటలో ఘనంగా జ్యోతిరావుపూలే వర్ధంతి వేడుకలు



నాయుడుపేట టౌన్, నవంబరు 28 ప్రభాతవార్త : నాయుడుపేట పట్టణంలో బస్టాండ్ వద్ద మహత్మ జ్యోతిరావుపూలే వర్ధంతి వేడుకలను మాజీఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో వైసిపి నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు. అనంతరం సూళ్ళూరు పేట మాజీఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య జ్యోతిరావుపూలే విగ్రహాలకు పూలమాలలువేసి నివాళర్పించారు.ఈ కార్యక్రమంలో మున్సిపాల్టి చేర్మెన్ కటకం దీపిక,ఎంపిపి కురుగొండ ధనలక్ష్మి, తంబిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డి,మాజీ ఎఎమ్‌సి చేర్మెన్ తంబిరెడ్డి జనార్దన్‌రెడ్డి, ఓట్టూరు కిషోర్‌యాదవ్, కలికి మాధవరెడ్డి, వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## జ్యోతిరావుపూలేకు ఘన నివాళులు



కోట,నవంబర్ 28 ప్రభాతవార్త : కోటలో గురువారం జ్యోతిరావు పులే 135 వర్ధంతి సందర్భంగా దళిత ఉద్యమనేత ఆర్.వి. రమణయ్య, జ్యోతిరావు పూలే చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జి షాదవరం సుధాకర్ (అహింస) ప్రిన్సిపల్ నారాయణ రావు, వైస్ ప్రిన్సిపల్ సరిత అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

## భూములను పరిశీలించిన సబ్ కలెక్టర్

కోట,నవంబర్ 28 ప్రభాతవార్త : కోట మండలం విద్యానగర్ సమీపంలోని గురువారం గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా భూములను పరిశీలించారు. విజయలక్ష్మీ అనే మహిళ తన భూములను వ్యవసాయేతర భూములుగా మార్చాలని జిల్లా కలెక్టర్‌కు ఇటీవల వినతిపత్రం అందచేసింది. ఆమేరకు గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా ఆ భూములను పరిశీలించారు. ఆయన వెంట కోట మండల తహిశీల్దార్ కె.జయజయరావు ఉన్నారు.

# పద్మావతి అమ్మవారికి పట్టువస్త్రాల సమర్పణ



తిరుచానూరు, నవంబర్ 28 ప్రభాతవార్త : తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్స వాలను పురస్కరించుకుని గురువారం రాష్ట్ర ప్రభుత్వం తరపున దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయానికి చేరుకున్న రాష్ట్ర మంత్రిని టిటిడి ఈవో శ్యామల రావు, జేఈవోలు వీరబ్రహ్మం, గౌతమి, సివి అండ్ ఎస్వో శ్రీధర్, ఆలయ అర్చకులు, అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం ఆశీర్వాద మండపం వద్ద తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో గోవిందరాజన్, విజివో సదాలక్ష్మి,సిఐ సునీల్ కుమార్ ఏవీఎస్వో వై.సతీష్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అమ్మవారికి వితరణగా 6 గొడుగులు



తిరుచానూరు, నవంబర్ 28 ప్రభాతవార్త : తిరుచానూరు కార్తీక బ్రహ్మోత్స వాలు సందర్భంగా చెన్నైకి చెందిన హిందూ మహాసభ ట్రస్ట్ చైర్మన్ వీర్ వవంత్ కుమార్ 6 గొడుగులను తితిదే ఈవో శ్యామలరావుకు తిరుచానూరు ఆలయం ముందు అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ గోవిందరాజన్, ఏవియస్ఓ సతీష్ పాల్గొన్నారు.







అమ్మవారి ఉద్యానవనంలో భక్తులను ఆకట్టుకుంటున్న పుష్ప ప్రదర్శన

## కార్తీక వనభోజనంలో ప్రజలు, విద్యార్థులు



శ్రీకాళహస్తి, నవంబర్ 28 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయం సారథ్యంలో గురువారం కార్తీక మాసం సందర్భంగా 'వనభోజనం' కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. దేవస్థానం భరద్వాజతీర్థంలోని గంగా సదన్‌లో ఏర్పాటు చేసిన వనభోజనం కార్యక్రమాలను ఆలయ ఇఓ టి.బాపిరెడ్డి దంపతులు పూజలు జరిపి ప్రారంభించారు. వనభోజనానికి ప్రజలు,భక్తుల నుంచి విశేష స్పందన వచ్చింది. ప్రతి ఏడాది వనభోజనం కార్యక్రమాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు. వచ్చిన భక్తులు సంతృప్తిగా భోజనం చేయటానికి ఏర్పాట్లు చేసారు. వనభోజనంలో ఓ సామాన్యభక్తుల్లా ఇఓ దంపతులు పాల్గొని అందరితో పాటు భోజనాలు చేసారు. భక్తులకు ఇఓ టి.బాపిరెడ్డి దంపతులు వడ్డించారు. ఈ కార్యక్రమాల్లో డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి వారి సిబ్బంది పాల్గొన్నారు. రుచికరమైన భోజనాలను అందించారని భోజనం చేసినవారు ప్రశంసించారు. సమీపంలోని బిసి కాలనీలోని విద్యార్థులందరితో పాటు ఉపాధ్యాయులకు కూడా భోజనం ఏర్పాటు చేసారు.ఇదో సందడిగా మారింది.



## ఏడుగంగమ్మల ఆలయ మండలాభిషేకం



శ్రీకాళహస్తి,నవంబర్ 28 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ఏడు గంగమ్మ ఆలయం పునర్నిర్మాణం కార్యక్రమాలను రూ.40లక్షలతో చేపట్టారు.ఈ ఆలయం కుంబాభిషేకం నిర్వహించారు. వచ్చేనెల 11 నుంచి ఏడుగంగమ్మల జాతర నిర్వహించనున్నారు. దాంతో గురువారం శ్రీకాళహస్తీశ్వరాలయం ఏడుగంగమ్మల ఆలయంలో మండలాభిషేకంను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయ ఉద్యోగులు ఇక్కడ పూజా కార్యక్రమాలను నిర్వహించారు.చిన్న ఆలయాల ఇన్‌చార్జి లక్ష్మయ్య సారథ్యంలో మండలాభిషేకం నిర్వహించారు.ఈ పూజల సందర్భంగా హోమాలు నిర్వహించారు. కలశ స్థాపన జరిపారు.ఆలయ పౌరోహితులు అర్ధగిరి, పూజారి దక్షిణామూర్తిల సారథ్యంలో కార్యక్రమాలను నిర్వహించారు. తెలుగుదేశం పార్టీకి సంబంధించి కాసరం రమేష్,అశోక్ జెట్టి తదితరులు పాల్గొన్నారు.

## లింగ నిర్ధారణ చేసిన వారిని పట్టుకుంటే లక్ష బహుమతి

- ఆశా కార్యకర్తలతో డెకాయ్ ఆపరేషన్లు
- వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం



చిత్తూరు, నవంబర్ 28 ప్రభాతవార్త: జిల్లాలోని స్కానింగ్ సెంటర్లలో ఎవరైనా గర్భిణీ స్త్రీలకు లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంటే ఒక లక్ష రూపాయలు బహుమతి ఇస్తామని కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రకటించారు. కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ సుమిత్‌కుమార్ గురువారం 'లింగ నిర్ధారణ చట్ట రీత్యా నేరం'పై పిసిపిఎన్‌డిటి చట్టంపై జిల్లా స్థాయి మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ ఆథారిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడు తూ జిల్లాలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టంను పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని కొన్ని స్కానింగ్ సెంటర్లు గర్భిణీ స్త్రీలకు లింగ నిర్ధారణ చేసి అబార్షన్‌కు కారకులవుతున్నారన్నారు. దీనిని పూర్తి స్థాయిలో కట్టడి చేయడానికి జిల్లా వ్యాప్తంగా డెకాయ్ ఆపరేషన్ల నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఆశా కార్యకర్తలు డెకాయ్ ఆపరేషన్ల ద్వారా స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు గుర్తించి రెడ్ హ్యాండెడ్‌గా పట్టిస్తే వారికి ఒక లక్ష రూపాయలు బహుమనం ఇవ్వడం జరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించి లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు స్కానింగ్ సెంటర్లను రెడ్ హ్యాండెడ్‌గా పట్టించిన ఐదు మంది ఆశా కార్యకర్తలకు రూ.5 లక్షలు ఇవ్వడం జరుగు తుందన్నారు. ఆశా వర్కర్లు ఈ అవకాశంను సద్వినియోగం చేసుకుని జిల్లా వ్యాప్తంగా డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించి గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు జరుగకుండా పక్కాగా చర్యలు తీసుకోవాలన్నారు. లింగ నిర్ధారణ చట్ట రీత్యా నేరమని ప్రభుత్వ ఆదేశాలు, చట్టాలకు లోపడి స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు విధులు నిర్వర్తించాలన్నారు. దీనికి విరుద్ధంగా ఎక్కడైనా స్కానింగ్ సెంటర్ల నిర్వాహకుల ప్రవర్తిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రభావతిదేవి, డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకటప్రసాద్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ హనుమంతరావు, డాక్టర్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

# కుప్పంలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

- కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్
- డిసెంబర్ చివరి వారంలో సిఎం చంద్రబాబు పర్యటన



కుప్ప ం, నవంబర్ 28 ప్రభాతవార్త : సిఎం చంద్రబాబునాయుడు సొంత నియోజకవర్గం కుప్పంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. గురువారం కడ కార్యాలయంలో పలు ప్రభుత్వ శాఖల అధికారులతో ప్రాజెక్ట్ డైరెక్టర్ సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలో చేపడుతున్న గోకులం షెడ్లు, మరుగుదొడ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. వీటికి సంబంధి ంచి నరేగా ద్వారా బిల్లులు సైతం లబ్ధిదారులకు సకాలంలో అ ందేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆర్అండ్‌బి శాఖ ద్వారా జరుగుతున్న రోడ్ల మరమ్మత్తు పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే తాగునీటి సమస్య పరిష్కారం కోసం 3.73కోట్ల నిధులు మంజూరయ్యాయని ఆ పనులు సైతం త్వరగా పూర్తి చేయాలన్నారు. కుప్పం నియోజకవర్గంలో వందశాతం సోలరైజేషన్ చేయాలని సిఎం చంద్రబాబునాయుడు నిర్ణయించారన్నారు. రాష్ట్రం లోనే కుప్పాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారన్నారు. దాదాపు 50వేల గృహాలకు సోలార్ విద్యుత్ సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. అదే విధంగా కుప్పం మున్సిపాలిటీలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు రూ 50కోట్ల నిధులను సిఎం చంద్రబాబునాయుడు మంజూరు చేశారన్నారు. డిసెంబర్ నెల చివరి వారంలో సిఎం కుప్పం పర్యటన రెండు రోజులు ఉండే అవకాశ ం ఉందన్నారు. అప్పుడు వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సిఎం చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేస్తారన్నారు. సిఎం సమక్షంలో ఇజి మార్ట్, కెవిన్ కేర్ వంటి సంస్థలతో ఎంఒయులు కుదుర్చుకోవడం జరుగుతుందన్నారు. ఈసందర్భ ంగా నియోజకవర్గంలో అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహిస్తారన్నారు. అందుకు తగిన విధంగా అధికార యంత్రాంగం పూర్తి నివేదికలతో సన్నద్ధంగా ఉండాలని ఆదేశించారు. ముఖ్యంగా ప్రజల నుంచి వచ్చిన సమస్యల పరిష్కారంపై ఆయా శాఖలు చేపట్టిన పరిష్కారాలను నివేదిక రూపొందించాలని సూచించారు. సమావేశంలో కుప్పం ఆర్డీఓ శ్రీనివాసులురాజు, రెస్కో ఎండి సోమశేఖర్, డిఇలు మదన్ మోహన్, గురవారెడ్డి, పురుషోత్తం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## చెత్త తరలింపు కేంద్రాన్ని తనిఖీ చేసిన కమిషనర్



తిరుపతి కార్పొరేషన్, నవంబర్ 28 ప్రభాతవార్త : నగరంలో ఉత్పత్తి అయ్యే చెత్తను తరలించేందుకు ఏర్పాటు చేసిన చెత్త తరలింపు కేంద్రాన్ని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య గురువారం తనిఖీ చేసారు. నగరంలో ఇంటింటి నుండి సేకరించిన చెత్తను తరలించేందుకు న్యూ బాలాజి కాలని, వినాయక సాగర్ వద్ద చెత్త తరలింపు కేంద్రాలను (గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్) ఏర్పాటు చేశారు. వినాయక సాగర్ వద్ద ఉన్న కేంద్రాన్ని గురువారం కమిషనర్ ఇంజీనీరింగ్, హెల్త్ అధికారులతో కలసి పరిశీలించారు. ఎన్ని వాహనాలు వస్తున్నాయి, ఒక్కో వాహనంలో ఎంత చెత్త వస్తోంది, వాహనాల కండిషన్ తదితర విషయాలను పరిశీలించారు. డ్రైవర్లు, సిబ్బంది హాజరు నమోదు, వాహనాల రాకపోకలు రిజిస్టర్ ను పరిశీలించారు. అంతక ముందు నగరపాలక సంస్థ కార్యాలయంలో అధికారులతో సమావేశమై రెండు కేంద్రాల్లో ఎన్ని వాహనాలు ఉన్నాయి తూకివాకం వద్ద గల చెత్త నిర్వహణ కేంద్రానికి రోజూ ఎంత చెత్త తరలిస్తున్నారు, అక్కడ ప్లాంట్స్ నిర్వహణ తదితర విషయాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ఇంటింటి చెత్త సేకరణ పక్కగా చేయాలని అన్నారు. ప్రతి వీధికి వెళ్లే వాహనాలు నిర్దిష్ట సమయంలో వెళ్లేలా ప్రణాళికలు సిద్ధం చేసి, వాహనాలు ఎక్కడెక్కడ వెళుతున్నాయో తెలుసుకునేలా జి.పి.ఎస్. సిస్టమ్ ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్ సేతు మాధవ్, డి. ఈ.లు, తదితరులు ఉన్నారు.

## చేసే పనిలో నిబద్ధత, క్రమశిక్షణ అవసరం



సత్యవేడు, నవంబరు 28 ప్రభాతవార్త: ప్రతిఫలం ఆశించకుండా నిబద్ధత, క్రమశిక్షణతోపని చేస్తే మంచి ఫలితాలు వెతుక్కుంటూ వస్తాయని ప్రఖ్యాత టాక్‌షో ప్రయోక్త, సాహితీ వేత్త కిరణ్‌ప్రభ పేర్కొన్నారు. శ్రీసిటీ ఆధ్యాత్మిక, సాహిత్య వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో గురువారం శ్రీసిటీలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన తన సతీమణి కాంతికిరణ్‌తో కలసి పాల్గొన్నారు. వారికి శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఘన స్వాగతం పలికి సత్కరించారు. కార్యక్రమంలో ప్రేక్షకులను ఉద్దేశించి కిరణ్‌ప్రభ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఉన్నతెలుగు సాహిత్యాభిమానులతో తన అద్భుత ప్రయాణాన్ని అనుభవాలను పంచుకున్నారు. తన తొలినాళ్ళను గుర్తు చేసుకుంటూ తెలుగు సాహిత్యం సంస్కృతిపై తనకున్న మక్కువే తన జీవితాన్ని తీవ్రంగా ప్రభావితం చేసిందన్నారు. విద్యార్థి రోజుల్లో తాను చేతితో రాసిన తెలుగు పత్రికను ప్రచురించడం ఈ గొప్ప ప్రయత్నానికి పునాదిగా నిలిచిందన్నారు. నెల్లూరు, చెన్నై, సూళ్లూరుపేటకు చెందిన సాహితీ ప్రియులు, ఉద్యోగులు హాజరై కిరణ్‌ప్రభ, కాంతి కిరణ్‌ల బహుముఖ ప్రజ్ఞను మెచ్చుకుని కార్యక్రమాన్ని ఆస్వాదించారు. అనంతరం ప్రేక్షకులు అడిగిన పలు సందేహాలను కిరణ్‌ప్రభ నివృత్తి చేశారు.

## ప్రమాదవశాత్తు బావిలో పడి విద్యార్థి మృతి



కాణిపాకం, నవంబర్ 28 ప్రభాతవార్త: : మోటారు సైకిల్ అదుపు తప్పడంతో ప్రమాదశాత్తు బావిలో పడి విద్యార్థి మృతిచెందిన సంఘటన కాణిపాకం పోలీస్‌స్టేషన్ పరిధిలోని మద్దిపట్లపల్లె వద్ద బుధవారం సాయం త్రం చోటు చేసుకుంది. కాణిపాకం ఎస్సై ధరణీధర కథనం మేరకు.. యాదమరి మండలం కమ్మరాయనిమిట్టకు చెందిన లోకచంద్రారెడ్డి కుమారుడు టిఎల్.రితేష్ (19), అతని స్నేహితుడు టి.ఉదయ్‌కిరణ్‌లు పీలేరులోని ఎంజెఆర్ కళాశాలలో చదువుకుంటున్నారు. వీరు ఇరువురు బుధవారం సాయంత్రం సుమారు 6.30 గంటలకు మోటారు సైకిల్‌పై కాలేజి నుండి ఇంటికి బయలు దేరారు. మోటారు సైకిల్‌ను రితేష్ అతి వేగంగా, అజాగ్రత్తగా నడుపడంతో అదుపుతప్పి మద్దిపట్లపల్లె వద్ద నున్న పేరూరు చెరువు కట్టకింద వున్న వ్యవసాయ బావిలో పడ్డారు. ఈసంఘటనలో మోటారు సైకిల్ నడుపుతున్న రితేష్ గాయాలకు గురై బావి నీటిలో మునిగి మృతి చెందాడు. వెనుక కూర్చొన్న ఉదయ్ కిరణ్ చెట్టు తీగలను పట్టుకుని బావి నుండి క్షేమంగా బయట పడ్డాడు. బుధవారం మృతదేహం కోసం ఎంత ప్రయత్నించినా లభ్యం కాకపోవడంతో పరిసర గ్రామాల ప్రజల సహకారంతో రితీష్ మృత దేహాన్ని గురువారం వెలికి తీశారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ధరణీధర తెలిపారు.

## ఎస్వీయూలో జ్యోతిరావు పూలే వర్ధంతి వేడుకలు

తిరుపతి విద్య, నవంబర్ 28ప్రభాతవార్త: భారతదేశ మొదటి సంఘసంస్కర్త సాంఘిక విప్లవ పితామహుడు మహాత్మ జ్యోతిరావు పూలే 134 వర్ధంతి వేడుకలను ఆంధ్రప్రదేశ్ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పర్చూరు నారాయణ గౌడ్ ఆధ్వర్యంలో ఎస్వీ యూనివర్సిటీ సెనైట్ హాల్లో ఘనంగా నిర్వహించడం జరిగింది.ముఖ్య అతిథిగా విచ్చేసిన యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య అప్పారావు మాట్లాడుతూ పూలే లాంటి వ్యక్తులను స్మరించుకోవడం మన పూర్వజన్మ సుకృతమని వారిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్లాలన్నారు.రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు మాట్లాడుతూ పూలే ఎన్నో ఆటుపోటులు ఎదుర్కొని విద్య ద్వారానే అన్ని సమస్యలకు పరిష్కారం ఉంటుందని తెలిపారు.నాయి బ్రహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా అవకాశం దక్కడం నా పూర్వజన్మ సుకృతం అన్నారు.దంపురు భాస్కర్ యాదవ్ మాట్లాడుతూ పూలే అనేక అవమానాలు భరించి తన భార్యకు విద్య నేర్పి అనేక మంది మహిళలకు ఆదర్శం అన్నారు.ఈ కార్యక్రమంలో శివకుమార్, ఉత్తరాది విజయ్,పరిశోధక విద్యార్థి ప్రమోద్ కుమార్, చిరంజీవి, శ్రీనివాసులు, రాజశేఖర్‌లు పాల్గొన్నారు.